J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 7 17.7.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## రసవత్తరం.. 'రంగు' రాజకీయం

# కోలీవుడ్ స్ఫూర్తితో.. టాలీవుడ్‌లో ఆశలు



- రాజకీయ రంగంలోకి తెలుగు తారాలోకం
- మహేష్‌బాబు, ప్రభాస్‌పై ఫ్యాన్స్ ఒత్తిడి
- మామ స్ఫూర్తితో అల్లు అర్జున్ ఆసక్తి
- ఇప్పట్లో ఎంట్రీ లేదని తేల్చేసిన తారక్
- ఆసక్తికరంగా మూడో ప్రత్యామ్నాయ ఆశలు

దేశంలో సినిమా రంగాన్ని శాసిస్తున్న తమ టాలీవుడ్ హీరోలు రాజకీయాల్లోనూ దుమ్ము దులిపేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఫలితంగా ఆయా హీరోలపై ఒత్తిడి రోజురోజుకూ తీవ్రమవుతోంది. ముఖ్యంగా తమిళనాట హీరో విజయ్ పార్టీ స్థాపించి డైరెక్ట్‌గా సీఎం పోస్టు కొట్టేయడంతో, తమ హీరోలు కూడా రాజకీయ రణరంగంలో చక్రం తిప్పాలని తెలుగు సినిమా హీరోల అభిమానులు ఉవ్విళ్లూరుతున్నారు.

అయితే ప్రస్తుతం కొత్త సినిమాలు చేయడం, కొత్త కథలు వినడం, డేట్స్ సర్దుబాటు చేయడం, రెమ్యూనరేషన్ వంటి విషయాలపైనే పెద్దహీరోలందరూ ఫోకస్ చేస్తుండడంతో వారి పొలిటికల్ ఎంట్రీపై సందిగ్ధత నెలకొంటోంది. మహేష్‌బాబు, ప్రభాస్ వంటి వారు తమకు రాజకీయాలపై ఏమాత్రం ఆసక్తి లేదని స్పష్టం చేస్తున్నా, వారి అభిమానగణం మాత్రం తెలుగు రాజకీయ తెరపై కూడా మన జెండా పాతాల్సిందేనంటూ పట్టుబడుతున్నారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ ఇప్పట్లో రాలేనంటూ సంకేతాలిస్తుండగా, అల్లు వారి అబ్బాయి మాత్రం భవిష్యత్‌లో రాజకీయాల్లో కాలు మోపాల్సిందే అని గట్టిగా ఫిక్సయినట్లు తెలుస్తోంది.

తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాన్ని, సినిమా రంగాన్ని వేరుచేసి చూడలేం. ఎందుకంటే మద్రాసు నుంచి హైదరాబాద్‌కి సినిమారంగం తరలిపోయిన కొద్దికాలానికే అగ్రనటుడు

2లో




జననం : 16.10.1930 నిర్యాణం : 20.07.2019

## 7వ వర్ధంతి



### శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారు

(స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి సతీమణి)
పరమపదించి జులై 20, 2026 నాటికి
ఏడేళ్ళు పూర్తవుతున్న సందర్భంగా...
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

- కుటుంబసభ్యులు

## మంచినీటి పైపులైను ధ్వంసం కేసులో..

# నిందితుడు దొరికాడు

నెల్లూరుజిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని సుమారు పాతికవేల మంది ప్రజల దాహార్తిని తీర్చే ప్రధాన తాగునీటి పైపులైనును ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసిన కేసులో ఒక వ్యక్తిని పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. పైపులైన్ విధ్వంసం కారణంగా పట్టణంలోని 23 వార్డుల్లో గత 10 రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడింది. నిందితుడిని అనంతసాగరం మండలం రేవూరు గ్రామానికి చెందిన బోయిల్ల రవీందర్‌రెడ్డిగా పోలీసులు గుర్తించారు. నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు పోలీసులు ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. ఆత్మకూరు ఇన్‌చార్జ్ సబ్-డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఎం.గిరిధర్‌రావు పర్యవేక్షణలో, ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.గంగాధర్‌రావు, అనంతసాగరం సబ్-ఇన్‌స్పెక్టర్ వి.రాజేష్‌లతో కూడిన ప్రత్యేక బృందం ఈ విషయమై దర్యాప్తు చేపట్టింది. నిందితుడిని గుర్తించి, ఆత్మకూరు పట్టణంలోని నెల్లూరుపాళెం సెంటర్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సోమశిల నుంచి ఆత్మకూరు పట్టణానికి నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైనును నిందితుడు బోర్ వెల్ మిషన్‌తో ఉద్దేశపూర్వకంగా పగులగొట్టినట్లు విచారణలో తేలింది. ఈ విధ్వంసక చర్య వల్ల తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పైపులైన్ ధ్వంసమై నీటి సరఫరా నిలిచిపోవడంతో మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. అందుకు సుమారు 5 లక్షల వరకు అదనపు వ్యయం అయినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగే విధంగా ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలుంటాయని, రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని సీఐ గంగాధర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# అక్రమ బోట్‌ల వల్ల..ఆంధ్ర మత్స్యకారులకు నష్టం

## • తమిళనాడు అధికారులకు వివరించిన కలెక్టర్ హిమాన్షు

ఆంధ్రప్రదేశ్ తీరానికి 23 కిలోమీటర్ల పరిధిలోకి ఇతర రాష్ట్రాలకు చెందిన చేపల వేట బోట్లు ప్రవేశించడం చట్టవిరుద్ధమని, దీనివల్ల ఆంధ్ర మత్స్యకారులకు నష్టం వాటిల్లుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. ఇటీవల కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాల్‌లో కలెక్టర్ ఆంధ్రప్రదేశ్-తమిళనాడు అంతర్‌రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్ల, జిల్లా అటవీశాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా, మెరైన్ మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు డా. పి. సురేష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర మత్స్యకారుల జీవనోపాధి, సముద్ర జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడం ప్రభుత్వ ధ్యేయ



విలేకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు, పక్కన ఎస్పీ అజిత వేజెండ్ల

మని, అక్రమంగా ప్రవేశించే బోట్లపై కఠిన చర్యలుంటాయని ఆయన స్పష్టం చేశారు. తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మత్స్య కారుల సమస్యలు, సముద్ర జలాల్లో బోట్‌ల అక్రమ ప్రవేశాల వల్ల కలుగుతున్న నష్టం తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ప్రతినిధులు చర్చించారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ, గత 3 నెలలుగా మన జిల్లా సరిహద్దు తీర ప్రాంతంలోని సముద్ర జలాల్లో అక్రమంగా చేపల వేట సాగిస్తున్న తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన మత్స్యకారుల వల్ల మన రాష్ట్ర మత్స్యకారులకు కలుగుతున్న నష్టాన్ని తమిళనాడు అధికారులకు సమావేశంలో వివరించినట్లు తెలిపారు. మే నెల నుంచి ప్రత్యేక సముద్ర గస్తీ ప్రారంభించిన అనంతరం అక్రమ ప్రవేశాలపై నిఘా కొనసాగుతోందని పేర్కొన్నారు. తామిచ్చిన అన్ని ఆధారాలను పరిశీలించిన తమిళనాడు ప్రతినిధులు సమస్య తీవ్రతను, మన బాధను అర్థం చేసుకొని, త్వరలోనే చెన్నైలో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అక్కడి మత్స్యకారులకు అవగాహన కల్పించి, ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు.

# కోలీవుడ్ స్ఫూర్తితో.. టాలీవుడ్‌లో ఆశలు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి 8 నెలల కాలంలోనే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు.

తెలుగు ప్రజల ఆత్మగౌరవం ఢిల్లీ వీధుల్లో బలవుతుంటే హస్తిన నాయకులే భయపడేలా ఆంధ్రా పౌరుషం చూపిస్తానంటూ ఆయన రాజకీయ తెరంగేట్రం చేశారు. ముఖ్యమంత్రిగా అనేక సంస్కరణలకు నాంది పలికి ముఖానికి రంగులేసుకునేవారూ రాజకీయాలు చేయగలరని నిరూపించారు. తర్వాత కాలంలో హీరో కృష్ణ, కృష్ణంరాజు, దాసరి నారాయణ రావు వంటి వారు పొలిటికల్ ఎంట్రీ ఇచ్చినా.. పూర్తిస్థాయిలో రాజకీయాలు చేయలేదనే చెప్పాలి. 2009లో ప్రజారాజ్యం పార్టీ పెట్టి ప్రజా క్షేత్రంలోకి వచ్చారు చిరంజీవి. అయితే దివంగత రాజశేఖర రెడ్డి చరిష్మా ముందు చిరు సినిమా గ్లామర్ పనిచేయలేదు. తరువాత కాలంలో ప్రజా రాజ్యాన్ని అయన కాంగ్రెస్‌లో విలీనం చేశారు. కొంతకాలం కేంద్ర మంత్రిగా పనిచేసి తన రాజకీయ కుతిని తీర్చుకున్నారు. 2014 తరువాత రాజకీయాల నుండి పూర్తిగా వైదొలిగారు. చిరంజీవి తమ్ముడు పవన్ తరహాలో మెగాస్టార్ కూడా ఓటమికి జంకకుండా రాజకీయాల్లో కొనసాగివుంటే ప్రస్తుత పరిస్థితులలో అయనే బలమైన మూడవ ప్రత్యామ్నాయంగా తెలుగు రాజకీయాలలో ప్రకాశించి ఉండేవాడని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న పవన్ కల్యాణ్ జనసేనపార్టీతో ప్రజల ముందుకొచ్చి డిప్యూటీ సీఎం స్థాయికి చేరుకున్నారు. అయితే తెలుగుదేశం పార్టీతో అంటకాగుతూ, ఎన్డీయే భాగస్వామిగా ఉండడంతో ఆయన్ని మూడో ప్రత్యామ్నాయంగా భావించలేని పరిస్థితి. దీంతో నవతరం కథనాయకుల రాజకీయ అరంగేట్రంపై ప్రస్తుతం జోరుగా చర్చలు సాగుతున్నాయి. అయితే వారిలో ఎవరు ఎప్పుడు లీడ్ తీసుకుని కొత్తపార్టీని ప్రకటిస్తారు..? అసలు ఆ అవకాశం టాలీవుడ్ స్టార్‌లలో ఎవరికి ఉంది..? పార్టీ పెట్టినా గట్టెక్కే పరిస్థితి ఉంటుందా..? అసలు మన స్టార్స్‌కి రాజకీయాలపై కొంచెమైనా ఆసక్తి ఉందా..? ఉన్నా.. కుల, వర్గ, ఆర్థిక స్థితిగతులు ఎంతవరకు సహకరిస్తాయి..? అనే అంశాలు ప్రస్తుతం చర్చనీయాంశమవుతున్నాయి. ప్రధానంగా పక్కరాష్ట్రం తమిళనాడులో కథనాయకుడు విజయ్ తొలుత అభిమాన సంఘాల ద్వారా సేవా కార్యక్రమాలు, దాతృత్వ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో పేరు తెచ్చుకుని తర్వాత రాజకీయాల్లోకి వచ్చి ఏకంగా సీఎం సీటునే చేజిక్కించుకోవడంతో ఆంధ్రాలోనూ అలాంటి అవకాశాలకు కొదవలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీకి ప్రత్యామ్నాయంగా ఆంధ్రరాజకీయాల్లో మూడో అడుగు బలంగా పడినట్లే. మరి ఆ అడుగు వేసే కథనాయకుడు ఎవరో... వారికి మార్గనిర్దేశం చేసే కథకుడెవరో... కాలమే నిర్ణయించనుంది.

### నలుగురు హీరోలు.. నాలుగు రకాలు!

ప్రస్తుతం టాలీవుడ్‌ను ఏలుతున్న నలుగురు హీరోల్లో ఎవరో ఒకరు భవిష్యత్‌లో ఖచ్చితంగా రాజకీయాల్లోకి వస్తారనే చర్చ ఇటీవలికాలంలో సాగుతోంది. ఇందులో ప్రధానంగా జూనియర్ ఎన్టీఆర్ పేరు తరచూ వార్తల్లో నిలుస్తోంది. 2009 ఎన్నికల సమయంలో ఆయన పెద్దఎత్తున తెలుగుదేశం పార్టీ కోసం శ్రమించారు. గాయపడి ఆస్పత్రి బెడ్‌పై ఉన్నా ప్రచారం చేశారు. అయితే ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో ఆ తర్వాత మిన్నకుండిపోయారు. దీనికి తోడు బాబాయ్ బాలకృష్ణ, మామ చంద్రబాబు, లోకేష్‌లతో అంతగా పొసగక పార్టీకి దూరమయ్యారు. తాజాగా "రా ఎన్టీఆర్" పేరుతో ఓ అభిమాన సంఘం ఊరువాడ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం రాజకీయ దుమారానికి కారణమైంది. తిరుపతిలో ఈనెల 18న నిర్వహించతలపెట్టిన ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం జూనియర్ ఎన్టీఆర్ సేవాభావాన్ని ప్రజలకు చాటడమే అని నిర్వాహకులు ప్రకటించారు. ఎన్టీఆర్‌పై తమ ప్రేమాభిమానాలను తెలియజేయడంతో పాటు పేదలకు అండగా నిలిచేందుకు ఈ కార్యక్రమం ద్వారా యత్నిస్తామని వారు స్పష్టం చేశారు. అయితే ఎన్టీఆర్ అభిమాన సంఘాలు మాత్రం దీన్ని వ్యతిరేకిస్తూ ఉనికి కోసం కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ జూనియర్ పేరును పలుచన చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్‌కు "రా ఎన్టీఆర్ ఊరువాడా" కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పేశారు. ఈమేరకు ఓ ప్రెస్‌నోట్‌ను కూడా విడుదల చేశారు. జూనియర్ అధికారిక కార్యాలయం సైతం దీనిని ఖండించింది. ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే ఇప్పట్లో ఎన్టీఆర్ రాజకీయ అరంగేట్రం ఉండబోదని స్పష్టమవుతోంది. ప్రస్తుతం సాగుతున్న ఊహాగానాలన్నీ అవాస్తవం, అభూత కల్పనలే అని తెలిపోయింది. ఒకవేళ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావాలని భావిస్తే అది 2034 ఎన్నికల తర్వాతే ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### దెబ్బతిన్న పులిలా అల్లు అర్జున్!

ఇక మరో సూపర్‌స్టార్ అల్లు అర్జున్ విషయానికి వస్తే గతంలో పుష్ప-2 విడుదల సమయంలో హైదరాబాద్‌లోని సుదర్శన్ థియేటర్‌లో తొక్కిసలాట జరిగి ఓ తల్లి మరణించడం, వారి కుమారుడు అపస్మారక స్థితిలోకి చేరి జీవచ్ఛవంగా మారడం పెను దుమారమే రేపింది. ఈ కేసులో అల్లు అర్జున్ అరెస్టు కావడం, దేశంలోనే అతిపెద్ద హిట్‌గా నిలిచిన చిత్రానికి కనీసం విజయోత్సవం చేసుకునే అవకాశం కూడా లేకపోవడం అల్లు అర్జున్‌ను తీవ్ర మనస్తాపానికి, అవమానానికి గురిచేసిందనడంలో సందేహం లేదు. రేవంత్ సర్కారు ఆదేశాలతో తెలంగాణ పోలీసులు అల్లు అర్జున్ బెడ్‌రూంలోకి వెళ్లిమరీ అరెస్టు చేయడం అప్పట్లో దేశవ్యాప్తంగా పెను సంచలనమైంది. ఈ క్రమంలో కావాల్సినంత పేరు, పలుకుబడి, డబ్బు ఉన్నా కేవలం రాజకీయ అధికారం లేకపోవడం వల్లే తాను అవమాన పడాల్సి వచ్చిందని అల్లు అర్జున్ తీవ్రంగా రగిలిపోతున్నట్లు, దెబ్బతిన్న తన ఈగో చల్లార్చుకునేందుకైనా రాజకీయంగా ఎదగాలని ఆయన భావిస్తున్నట్లు తెలిసింది. ఇక తన మామ చిరంజీవి గతంలో పార్టీ పెట్టడం, ఆయన తమ్ముడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తన సినీ అభిమానాన్ని ఓట్లుగా మార్చుకుని డిప్యూటీ సీఎం స్థాయికి ఎదగడం కూడా అల్లు అర్జున్ స్ఫూర్తిగా తీసుకుని పొలిటికల్ ఎంట్రీవైపు ఆసక్తి చూపుతున్నట్లు అల్లు అభిమాన వర్గాలు చెప్తున్నాయి. భవిష్యత్‌లో టాలీవుడ్ నుంచి రాజకీయంగా ఏ హీరో వచ్చినా రాకున్నా అల్లు అర్జున్ ఎంట్రీ మాత్రం పక్కా అని కొందరు విశ్లేషకులు, సినీ ప్రముఖులు బల్లగుద్ది చెబుతుండడం ఈ విషయానికి బలాన్ని చేకూరుస్తోంది.

### మహేష్, ప్రభాస్... కక్కలేక మింగలేక!

ఇక ప్యాన్ ఇండియా సూపర్‌స్టార్ ప్రభాస్, అగ్ర కథానాయకుడు మహేష్‌బాబు ఉంటే సినిమాలు లేకుంటే తమతమ కుటుంబాలకి అత్యంత ప్రాముఖ్యత ఇస్తున్న విషయం తెలిసిందే. తనకు రాజకీయాలపై ఆసక్తిలేదని, ఎమ్మెల్యే అంటే అర్థమేమిటో కూడా తనకు తెలియదని చాలాసార్లు మహేష్‌బాబు బహిరంగంగానే ప్రకటించారు. కృష్ణ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని సినీరంగంలో తనకంటూ ప్రత్యేక స్టార్‌డమ్‌ను ఆయన సంపాదించుకున్నారు. దీనికితోడు కావాల్సినంత అభిమానగణం అతడి సొంతం. ఇక బావ గల్లా జయదేవ్‌ది కూడా రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబమే. ఈ పరిస్థితుల్లో తమిళనాట విజయ్ తరహాలో మహేష్‌బాబు కూడా రాజకీయాల్లోకి రావాలని వారి అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. దీంతో మహేష్‌బాబు ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది. దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' చిత్రం పూర్తయిన తర్వాత తన అభిమాన సంఘాలను పిలిచి, తగిన క్లారిటీ ఇవ్వాలని మహేష్ బాబు యోచిస్తున్నట్లు సమాచారం. అలాగే రెబల్‌స్టార్ కృష్ణంరాజు వారసుడిగా సినీరంగంలోకి వచ్చి బాహుబలి హీరోగా ప్రభాస్ వెలిగిపోతున్నారు. రాజకీయ అంశాలపై ఆయన ఇప్పటి వరకు ఒక్కసారి కూడా స్పందించిన దాఖలాలు లేవు. అయితే ప్రభాస్ అభిమానులు మాత్రం రాజకీయాలపై తన అభిప్రాయాన్ని తెలియజేయాలని ప్రభాస్‌పై వత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. దీంతో వచ్చేందుకు ఇష్టంలేక అభిమానుల ఒత్తిడిని తట్టుకోలేక మహేష్, ప్రభాస్ తర్జనభర్జన పడుతున్నట్లు సినీ వర్గాల సమాచారం.

### ఎవరొచ్చినా జగన్‌కే దెబ్బ!

ఎదురు చూపులు ఫలించి, అభిమానుల కోరిక నెరవేరి నవతరం కథానాయకులైన మహేష్‌బాబు, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్‌లలో ఎవరు రాజకీయ అరంగేట్రం చేసినా తొలిదెబ్బ జగన్ పార్టీకే పడుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎందుకంటే గతంలో జగన్ సీఎం హోదాలో ఉండి సినీరంగ ప్రముఖులను తీవ్రంగా అవమానించారని, కిలోమీటర్ల దూరం నడిపించారంటూ అప్పట్లో పెద్దఎత్తున విమర్శలున్నాయి. ఇక చంద్రబాబు అండకోకు సినీరంగం నుంచి అతిపెద్ద సపోర్ట్ ఉందన్నది బహిరంగ రహస్యం. పైగా జగన్‌పై ఉండే కేసులు, అవినీతి అంశాలు కూడా కొత్త పార్టీలు జగన్‌వైపు చూసే అవకాశం లేకుండా చేసేందుకు కారణం కావొచ్చు. పైగా కొత్తగా పార్టీ ఏదైనా పుట్టుకొస్తే అది బలమైన మూడో ప్రత్యామ్నాయంగా కూడా మారే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే తమిళనాట విజయ్ కూడా డీఎంకే, అన్నాడీఎంకే వంటి అతిపెద్ద ప్రాంతీయ ద్రవిడ పార్టీలను మట్టికరిపించి యువతరం, మహిళా ఓట్లతో సీఎం పీఠాన్ని దక్కించుకున్నారు. అదే తరహాలో ఎన్టీఆర్, ప్రభాస్, అల్లు అర్జున్, మహేష్‌బాబులలో ఎవరో ఒకరు ముందడుగు వేస్తే ఆంధ్రయువతికపై కొత్త నేతను చూసే అవకాశం ఉంటుంది. మరి జెన్‌జి తరాన్ని తమవైపు తిప్పుకున్న కథానాయకులు అభాలగోపాలాన్ని ఆకట్టుకుని రాజకీయాల్లోకి వస్తారో.. లేక ఊహాగానాలకే పరిమితమై రజనీకాంత్ తరహాలో రాంరాం చెబుతారో కాలమే నిర్ణయించనుంది.

ఏదేమైనా కోలీవుడ్ స్ఫూర్తితో టాలీవుడ్‌లో కొత్త రాజకీయ ఆశలు చిగురిస్తున్నాయన్నది మాత్రం అందరూ అంగీకరిస్తున్న వాస్తవం...!

## ఎన్నో ఏళ్ల నాటి సమస్యకు..

# విపిఆర్ చొరవతో పరిష్కారం

## • వేమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న జేమ్స్‌గార్డెన్, వెంకట్రామపురం ప్రజలు

నెల్లూరు నగరంలోని జేమ్స్ గార్డెన్, వెంకట్రామపురం ప్రాంతాల ప్రజలు తమ ప్రాంతంలో దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్య నెల్లూరు ఎంపీ విపిఆర్ (వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి) చొరవతో పరిష్కారమైంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. జేమ్స్ గార్డెన్, వెంకట్రామపురం ప్రాంతాలకు ఆనుకుని ఉన్న రైల్వేట్రాక్ వెంట రక్షణ గోడ లేక పోవడంతో ప్రజలకు ఎంతో ఇబ్బందిగా ఉండేది. అక్కడంతా అక్రమ కార్యకలాపాలు, అసాంఘిక చర్యలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలకు గురవుతూ, గతంలో ఈ సమస్యను విపిఆర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యపై వెంటనే స్పందించిన ఆయన, వెంటనే రైల్వే రక్షణ గోడకు నిధులు మంజూరు చేశారు. మూడు నెలల్లోపే నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. చాలా ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యకు వేగంగా పరిష్కారం చూపినందుకు స్థానికులు విపిఆర్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో టీడీపీ 45వ డివిజన్ అధ్యక్షులు సుజన్‌కుమార్, శ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరరావు, శివకుమార్, నాగేందర్‌రావు, అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

# రాష్ట్రంలోని చెత్తనంతా తొలగిస్తున్నాం

## మంత్రి నారాయణ



దొంతాలి డంపింగ్‌యార్డ్‌లో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తనంతా తొలగించేందుకు చర్యలు చేపట్టామని, ఈ నెలాఖరుకల్లా పూర్తిగా తొలగించి, ఆంధ్రప్రదేశ్‌ను చెత్తరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా. పి.నారాయణ స్పష్టం చేశారు. ఈనెల 15న ఆయన నెల్లూరు నగరంలోని దొంతాలి డంపింగ్ యార్డును పరిశీలించి, అక్కడ జరుగుతున్న చెత్త ప్రాసెసింగ్ పనులను అధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వం చెత్త నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే కాక, ప్రజలపై చెత్త పన్ను విధించిందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 153 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందన్నారు. తమ ప్రభుత్వం గత రెండేళ్లలో 130 లక్షల టన్నుల చెత్తను తొలగించగా, మిగిలిన 23 లక్షల టన్నుల చెత్త ప్రస్తుతం ప్రాసెసింగ్‌లో ఉందని, జూలై నెలాఖరుకల్లా మొత్తం తొలగిస్తామని తెలిపారు.

### చెత్తతో విద్యుత్ ఉత్పత్తి :

రాష్ట్రవ్యాప్తంగా రూ.300 కోట్ల వ్యయంతో ఆధునిక ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని మంత్రి తెలిపారు. గుంటూరు, విశాఖపట్నంలోని వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్లలో ప్రతిరోజూ 2,800 టన్నుల చెత్తను ప్రాసెస్ చేసి విద్యుత్ ఉత్పత్తిచేస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 107 ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, జూలై నెలాఖరుకల్లా వాటిని ప్రారంభిస్తామని వెల్లడించారు. దొంతాలి డంపింగ్ యార్డులో సుమారు లక్ష టన్నుల చెత్తను తొలగించాల్సి ఉందని, ఈ నెలాఖరుకల్లా దానిని కూడా పూర్తిగా తొలగిస్తామని మంత్రి తెలిపారు. ఇక్కడ జిందాల్ కంపెనీ వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోందని, రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేసి ప్లాంట్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. ప్లాంట్ ప్రారంభమైన తర్వాత 100 కిలోమీటర్ల పరిధిలో ఉత్పత్తి అయ్యే చెత్తను రోజువారీగా ప్రాసెస్ చేసి నివారించనున్నట్లు వివరించారు.

# కేంద్ర పథకాల అమలుపై..విపిఆర్ సమీక్ష



నెల్లూరు జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, వాటి ద్వారా మంజూరు చేస్తున్న రుణాల పురోగతిపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 15న చర్చించారు. నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (డి.డి.ఎం) డాక్టర్ బాబు, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్.డి.ఎం) మణిశేఖర్ ఆయనను కలిసి, జిల్లాలో ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాల కింద లబ్ధిదారులకు మంజూరు చేసిన రుణాలు, పథకాల అమలు తీరును తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చూడాలని విపిఆర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. రుణాల మంజూరు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, ఎక్కువమందికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా జిల్లాలో ఒక 'మెగా లోన్ మేళా' నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. అందుకు సంబంధించిన కార్యాచరణ, ప్రణాళికలపై అధికారులతో చర్చించారు.

# గిరిజనులకు చేయూతనందించాలి

## ఎమ్మెల్యే సోమిరెడ్డి



చిన్నారులకి మిఠాయిలు పంచుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

అనాదిగా అజ్ఞానంలో, పేదరికంలో కొట్టుమిట్లాడుతున్న గిరిజనుల అభ్యున్నతికి అందరూ పాటుపడాలని, వారికి అందరూ చేయూతనందించాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రత్యేకించి చల్లా యానాదుల బిడ్డలు బడికి వెళ్లేలా సచివాలయ ఉద్యోగులు దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముత్తుకూరులో ఇటీవల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, చలివేంద్ర గ్రామంలో ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని రూ.10 లక్షలతో పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. బీసీ కాలనీ గొల్లవీధిలో రూ.15.20 లక్షలతో మూడు సిమెంట్ రోడ్లను ప్రారంభించామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి పనులు జోరందుకున్నాయని చెప్పారు. పలు కంపెనీల సీఎస్ఆర్ నిధులను నియోజకవర్గ అభివృద్ధి కోసం సద్వినియోగం చేస్తున్నామన్నారు. పీ4 కార్యక్రమానికి సీఎస్ఆర్ నిధులను అనుసంధానం చేసి చేసిన కార్యక్రమాలన్నింటికి పుస్తక రూపం ఇచ్చి ఇటీవల సీఎం చంద్రబాబునాయుడికి అందించామని, వాటిని చూసి ముఖ్యమంత్రి అభినందించారని చెప్పారు. ముత్తుకూరు హైస్కూలుకు చలివేంద్ర నుంచి కాలినడకన వెళ్లే చిన్నారుల కోసం పోర్టు ఆధ్వర్యంలో వాహనం ఏర్పాటు చేయించామని, పైనాపురం పంచాయతీలోనూ ఎస్ఇఐఎల్ కంపెనీ సహకారంతో వ్యాను ఏర్పాటుచేశామని తెలిపారు. అంకుపల్లి ఎస్టీ కాలనీలో పిల్లల కోసం స్కూలు ఏర్పాటు చేయించామని, సీఎస్ఆర్ నిధులతో ఆ స్కూలుకు త్వరలోనే శాశ్వత భవనం నిర్మించబోతున్నామని ఆయన చెప్పారు. త్వరలో పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఢిల్లీ వెళ్లి ఎంపీలు బీద మస్తాన్‌రావు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల సహకారంతో మన రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులతో కలిసి కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని కలవబోతున్నామని సోమిరెడ్డి తెలిపారు.

# గణేష్ ఘాట్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతాం

## • రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



గణేష్ ఘాట్‌ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు చెరువు ఒడ్డున ఉన్న గణేష్ ఘాట్‌ని సుందరంగా తీర్చిదిద్దుతామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. రానున్న వినాయకచవితిని పురస్కరించుకుని గణేష్‌ఘాట్ అభివృద్ధిపై ఆయన నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సంబంధిత అధికారులు, నాయకులతో చర్చించారు. ఘాట్‌ను పరిశీలించారు. వినాయక నిమజ్జన ఏర్పాట్లపై విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. ఘాట్ అభివృద్ధిలో నుడా పాత్ర కీలకమన్నారు. నగర మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఈ చర్చల్లో పాల్గొన్నారు. గణేష్ ఘాట్‌ను నా శక్తికిమించి అభివృద్ధి చేశానని, భాగ్యనగరం హైదరాబాద్ తరహాలో నెల్లూరు నగరంలో గణేష్ నిమజ్జనాన్ని నిర్వహిస్తామని శ్రీధర్‌రెడ్డి చెప్పారు. రానున్న రోజుల్లో పర్యాటక ప్రాంతంగా కూడా ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామన్నారు. స్థానిక కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సురేంద్రరెడ్డి, మండ్ల ఈశ్వరయ్య, విజయ్‌కుమార్, కో క్లస్టర్ ఇంచార్జ్ విష్ణుప్రియ, స్థానిక తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సురేష్ పాల్గొన్నారు.



లాయర్
జులై 17, 2026

# పెరుగుతున్న రాక్షసత్వం.. మాసిపోతున్న మానవత్వం!

సమాజం ఇప్పుడు ఏ గతిలో తిరుగుతోందని 'ఏరియల్ వ్యూ' (విహంగ వీక్షణం)లో చూసుకుంటే, మతి తప్పి..గతి తప్పి పెడదారి పట్టిపోతుందనే విషయం ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది. అందుకు రుజువులు కోకొల్లలు. గత కొద్దికాలంగా కనీవినీ ఎరుగని అకృత్యాలు, అఘాయిత్యాలు, అరాచకత్వాలతో రాష్ట్రమే కాదు, దేశమంతా భీభత్సంగా తయారవుతోంది. మనిషి మానవమృగంగా మారిపోతున్నాడు. అతివలపై, అభంశుభం ఎరుగని చిన్నారులపై మానభంగాలు పెరిగిపోతున్నాయి. అశ్లీలం విజృంభించి, అసభ్యతా విష ప్రభంజనం సమాజాన్ని పట్టిపీడిస్తోంది.

మరోవైపు దేశంలో కులాలు మతాల పేరుతో రచ్చలు రావిళ్ళు పెరిగిపోతున్నాయి. నోరుంది కదా అని ఎవరినంటే వారిని.. ఎట్లంటే అట్ల, ఎవరిష్టం వచ్చినట్లు వారు సోషల్ మీడియాలో రంకెలు వేస్తుండడం పరమ జుగప్సాకరంగా ఉంది. సెల్‌ఫోన్లలో వింటుంటే.. వారి మాటలు రోత పుట్టిస్తున్నాయి. రాముళ్ళను దేవుళ్ళుగా కొలుచుకునే నేలపై రాక్షస రావణులదే రాజ్యమైపోతోంది. ఎవరికీ ఎక్కడా నియంత్రణ ఉండడం లేదు. వారి మాటల వల్ల సమాజం ఎంతగా పెడదారి పడుతోందో పట్టించుకోవడం లేదు. దిగజారుడు రాజకీయాలతో కొంతమంది నాయకులు సైతం వీటిని ప్రోత్సహిస్తుండడం చూసి ప్రజలకి అసహ్యం కలుగుతోంది.

ఇంకోవైపు సమాజంలో ప్రేమలు అభిమానాలు, మానవీయత, సేవాభావం వంటివి అడుగంటిపోతున్నాయి. ఎక్కడ చూసినా స్వార్థం.. అవినీతి. విపరీతమైన ధనాశ సామాన్య కుటుంబాలను సైతం నాశనం చేస్తోంది. భార్యల్ని భర్తలు, భర్తల్ని భార్యలు కాల్చుకుతింటున్నారు. బిడ్డల్ని తల్లితండ్రులే గొంతునులిమి కాటికి పంపుతున్నారు. కనీసం మానవత్వమన్నది ఏకోశానా ఉండడం లేదు. పైశాచిక ప్రవృత్తితో మనిషి పిశాచిగా మారిపోతున్నాడా అనిపిస్తోంది. నేటి పరిస్థితులను అవలోకనం చేసి చూసుకుంటే..అసలు మనం ఎటుపోతున్నాం.. ఎక్కడికిపోతున్నామో అర్థం కావడం లేదు. ఆస్తుల కోసం, సొంతవారినే చంపుకుతింటున్న విషసంస్కృతి ప్రబలిపోతోంది. డబ్బుకోసం ఎంతటి నీచ స్థితికైనా దిగజారిపోతున్నారు. ఇటీవల కొన్ని సంఘటనలు మనసున్నవారిని కంటతడిపెట్టిస్తున్నాయి. ఒకరినొకరు అర్థం చేసుకోలేక, కుటుంబ కలహాలతో పేద, మధ్యతరగతి సంసారాలు కుప్పకూలిపోతున్నాయి. పాతకాలంలో ఉన్న సభ్యతా సంస్కారాలు, మర్యాద మన్నన అన్నీ మట్టికొట్టుకుపోయి, నేటి ఆధునిక సెల్‌ఫోన్‌ల కాలంలో మనిషి బతుకు ఛిద్రమైపోతూ ఉంది. నైతిక విలువలన్నవే కానరావడం లేదు. కారణాలేమైతేనేం.. తెలంగాణలో ఇటీవల ఒక ఉన్మాది.. బాలికను వేధించినందుకు తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో ఆ బాలికను, ఆ బాలిక తల్లిని, అమ్మమ్మతో పాటు, తన భార్యను, తన ఇద్దరి పిల్లలను..మొత్తం ఆరుగురిని అత్యంత పాశవికంగా హత్యచేశాడు. ఈ సంఘటన తెలుగురాష్ట్రాల్లో సంచలనం కలిగించింది. మొన్నటికి మొన్న ఈనెల 12న తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలో ఓ తండ్రి తన ముగ్గురు పిల్లలు నిద్రపోతుండగా వారి చేతులకు కాళ్లకు విద్యుత్ వైర్లు చుట్టి కరెంటుషాక్ పెట్టి 14 ఏళ్ల కూతురిని, 12ఏళ్ళ కొడుకుని అమానుషంగా మట్టుపెట్టాడు. ఆ తర్వాత తానూ విద్యుత్ వైరును కాలికిచుట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాలతో భార్య ఇల్లు విడిచివెళ్ళిపోవడంతో, ఆ భర్త ఈ కిరాతకానికి ఒడిగట్టాడు. అదేరోజున, కర్నాటకలోని బెంగళూరులో మతితప్పిన ఓ యువకుడు కన్నతల్లిని, ప్రేమను పంచిన అమ్మమ్మను, అడ్డొచ్చిన మేనమామను కత్తితో పొడిచి చంపి, తాను ఉరేసుకుని చచ్చిపోయాడు. తాజాగా పల్నాడు జిల్లా వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో ఈనెల14న ఓ తల్లి 5 ఏళ్లు, 3 ఏళ్ల వయసున్న కన్న కొడుకులిద్దరికీ విషమిచ్చి మట్టుపెట్టింది. పిల్లలు అరవకుండా దిండు అదిమిపట్టి మరీ చంపేసింది. ఆ తర్వాత తానూ విషం తాగి ఉరేసుకుని చచ్చిపోయింది. ఏమిటింత ఘోరం?.. ఎంత విషాదం!.. ఇలాంటి అమానవీయ ఘటనలతో దేశం అట్టుడికిపోతోంది. సమాజంలో మానవీయ విలువలు ఇంకా పతనం కాకుండా, అమానుషాలు జరగకుండా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ప్రభుత్వాలు గట్టిగా కృషిచేయాల్సి ఉంది. మానవతావాదులు, సమాజ సేవాభిలాషులు, చదువుకున్న యువకులు ఎక్కడికక్కడ వారున్న ప్రాంతాల్లో ప్రజలకు సమాజం పట్ల, సమస్యల నివారణల పట్ల అవగాహన కలిగించాల్సి ఉంది. కుటుంబ కలహాలు సంసారాలను నాశనం చేసేవిగా ఉండకుండా, హత్యలు, ఆత్మహత్యలతో కుటుంబాలు కాలిపోకుండా అటు ప్రభుత్వాలు, ఇటు సమాజ సంస్కర్తలు రంగంలోకి దిగి సంయుక్త కార్యక్రమాల నిర్వహణతో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన తరుణం ఇదే!...

## అన్నమయ్య కూడలిలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి




నెల్లూరు నగరం మినీ బైపాస్‌లోని అన్నమయ్య కూడలి ఇటీవల ప్రముఖ నేపథ్య గాయకులు దివంగత ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యం గారి విగ్రహం ఆవిష్కరణతో మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే, ఆ ప్రాంతంలో అస్తవ్యస్తంగా జరుగుతున్న వాహనాల పార్కింగ్ కారణంగా నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్పీబీ విగ్రహం ఎదురుగా సైతం వాహనాలని అడ్డంగా పెట్టి దారి మూసేస్తున్నారు. గతంలో ఇదే కూడలిలో రహదారిని ఆక్రమించి ఏర్పాటైన దుకాణాలను స్థానిక శాసనసభ్యులు చొరవ తీసుకుని తొలగించడం అభినందనీయం. అయినప్పటికీ, ప్రస్తుతం అక్కడ ఉన్న ఇరానీ చాయ్ దుకాణానికి వచ్చే వాహనాలు రహదారి పైనే అడ్డదిడ్డంగా నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రరూపం దాల్చుతోంది. ముఖ్యంగా రద్దీ వేళల్లో పరిస్థితి అదుపు తప్పుతోంది. ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. అందువల్ల స్థానిక శాసనసభ్యులు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, రహదారిపై అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా నివారించేలా కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులను నియమించడం, "నో పార్కింగ్" నిబంధనలను కచ్చితంగా అమలు చేసి చలానాలు ద్వారా ఫైన్‌లు విధించే చర్యలు చేపట్టాలి. ప్రజల ప్రాణ భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అన్నమయ్య కూడలిలో శాశ్వత పరిష్కారం చూపించాలని మనవి...!

**ఆర్.పీ.రామయ్య, కొండాయపాళెం**

## వార్షికోత్సవ శుభాకాంక్షలు

గత 45 సంవత్సరాలుగా నెల్లూరు ప్రజలకు విశ్వసనీయమైన వార్తలు, లోతైన విశ్లేషణలు అందిస్తూ, వాస్తవాలను నిర్భయంగా ఆవిష్కరిస్తూ, నిష్పక్షపాత జర్నలిజానికి అద్దం పట్టిన 'లాయర్' వార్తాపత్రికకు 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. సత్యాన్వేషణను ధ్యేయంగా చేసుకుని, ప్రజా ప్రయోజనాల కోసం రాజీలేని పాత్రికేయ విలువలను పాటిస్తూ సాగుతున్న 'లాయర్' అంకితభావం నిజంగా అభినందనీయం. రాజకీయ విశ్లేషణలు, సాహిత్య వార్తలు, నెల్లూరుజిల్లా స్థానిక విశేషాలు అందిస్తూ.. క్రమం తప్పకుండా ప్రతి గురువారం సాయంత్రానికి సెల్‌ఫోన్‌లలో ప్రత్యక్షమవడం 'లాయర్' ప్రత్యేకత. నెల్లూరుజిల్లా వాసులు ప్రపంచ నలుమూలలా ఎక్కడ వున్నా వారు నెల్లూరులోనే ఉన్నామనే భావన కలిగేలా స్థానిక వార్తల సమాహారాన్ని అందిస్తుంది 'లాయర్'. సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న 'లాయర్' ప్రయాణం మరెన్నో విజయాలతో కొనసాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. 'లాయర్' వార్తాపత్రిక యాజమాన్యానికి, సంపాదకవర్గానికి, పాత్రికేయులకు, సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు మరియు 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు. **– లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.**

# సామ్రాజ్యవాద అహంకారం!

మనసులో మాట 106

ఒకప్పుడు బ్రిటన్ పాలనలో ఉంటూ అభివృద్ధి చెందినందుకు, వలస దేశాలే ఇప్పుడు తమకు ఎదురు డబ్బులు చెల్లించాలంటూ బ్రిటన్ మాజీ హోంశాఖ మంత్రి, భారత సంతతికి చెందిన ఎంపీ సువెల్లా బ్రవెర్మన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. బానిసత్వానికి, వలస దోపిడీకి గురైన జమైకా వంటి కామన్వెల్త్ దేశాలు బ్రిటన్ రాజు ఛార్లెస్–3 నుండి చారిత్రక పరిహారం (Reparations) కోరుతున్న తరుణంలో ఆమె ఈ విధమైన స్పందన శతాబ్దాల నాటి అణచివేత గాయాలపై కారం చల్లడమే అవుతుంది. బ్రిటిష్ సామ్రాజ్యం ప్రపంచానికి ప్రజాస్వామ్యాన్ని, ఆధునికతను నేర్పిందనే ఆమె వాదన కేవలం చారిత్రక అజ్ఞానాన్ని మాత్రమే కాదు, ఒకనాటి క్రూర వలస పీడనను సమర్థించే సామ్రాజ్యవాద అహంకారాన్ని కూడా ప్రతిబింబిస్తోంది.

వలస పాలకులు ఆయా దేశాలలో చేసిన 'ఖర్చు' గురించి మాట్లాడే ముందు, వారు సాగించిన వ్యవస్థీకృత సంపద తరలింపు గురించిన నగ్న సత్యాలను ప్రపంచం గమనించాలి. సుప్రసిద్ధ ఆర్థికవేత్త, జేఎన్‌యూ మాజీ ప్రొఫెసర్ ఉత్స పట్నాయక్ రెండు శతాబ్దాల (1765–1938) బ్రిటిష్ పన్నులు, అంతర్జాతీయ వాణిజ్య రికార్డులపై లోతైన పరిశోధన చేశారు. కొలంబియా యూనివర్సిటీ ప్రెస్ ప్రచురించిన ఆమె గణాంకాల ప్రకారం.. బ్రిటిష్ రాజ్ కేవలం భారతదేశం నుంచే ఏకంగా 44.6 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ. 3,700లక్షల కోట్లు) సంపదను లండన్‌కు తరలించింది. భారతీయ ఎగుమతిదారుల సొమ్మును వారి పన్నుల రూపంలోనే రూపాయిల్లో చెల్లించి, అంతర్జాతీయంగా వచ్చిన అసలు ఆదాయాన్ని (బంగారం, వెండి రూపంలో) బ్రిటన్ నొక్కేసింది. ఈ భారీ దోపిడీయే బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవానికి, వారి నేటి ఆధునిక ఆర్థిక ఉన్నతికి ప్రధాన పునాది.

బ్రిటిష్ ఆర్థిక చరిత్రకారుడు అంగస్ మాడిసన్ చేసిన జగద్విదితమైన పరిశోధనల ప్రకారం.. బ్రిటిష్ వారు రాకముందు, అంటే క్రీ.శ. 1700 నాటికి ప్రపంచ మొత్తం జీడీపీలో భారతదేశ వాటా 23 శాతం నుండి 24.4 శాతం వరకు ఉండేది. ఇది సమగ్ర ఐరోపా ఖండం మొత్తం జీడీపీ కంటే ఎక్కువ. కానీ, రెండు శతాబ్దాల బ్రిటిష్ రాక్షస పాలన ముగిసి, 1947లో వారు వెళ్లేసరికి భారతదేశ వాటా కేవలం 3 శాతానికి పడిపోయింది. ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశాన్ని, ఆకలి కేకలు–క్షామాలతో అలమటించే దరిద్ర దేశంగా మార్చిన ఘనత ముమ్మాటికీ బ్రిటిష్ పాలకులదే.

భారతదేశ సంస్కృతికి, సార్వభౌమత్వానికి ప్రతీకలైన అమూల్యమైన సంపదను, కళాఖండాలను బ్రిటన్ అడ్డగోలుగా అపహరించింది. ప్రపంచప్రసిద్ధ కోహినూర్ వజ్రం, సుల్తాన్‌గంజ్ బుద్ధ విగ్రహం, అమరావతి స్తూప శిల్పాలు, టిప్పు సుల్తాన్ ఖడ్గం, ఇంకా వేల సంఖ్యలో ఉన్న విలువైన తాళపత్ర గ్రంథాలు, కళా సంపదను లండన్ మ్యూజియాలకు తరలించి, నేటికీ వాటిని తమ సొంత ఆస్తులుగా బ్రిటన్ ప్రదర్శించుకుంటోంది. ఈ విలువైన సాంస్కృతిక వారసత్వాన్ని, అపహరించిన వస్తువులను తిరిగి తమకు అప్పగించాలంటూ భారతదేశం చాలా కాలంగా దౌత్యపరమైన డిమాండ్లను గళమెత్తుతోంది. వలస దేశాల నుండి దోచుకున్న ఈ సంపదంతా నేటికీ బ్రిటన్ టూరిజం ఆదాయానికి, వారి మ్యూజియంల వైభవానికి ప్రధాన వనరుగా నిలిచింది. ఇలాంటి చారిత్రక సత్యాలు కళ్లముందు కదలాడుతుంటే, తామేదో వలస దేశాలకు ఉపకారం చేశామని, ఆ దేశాలే తమకు తిరిగి చెల్లించాలని వాదించడం అన్యాయం.

బ్రవెర్మన్ వాదిస్తున్నట్లు వలస పాలకులు నిర్మించిన రైల్వేలు, పరిపాలనా వ్యవస్థలు స్థానిక ప్రజల సంక్షేమం కోసం చేసినవి కావు. అవి వలస దేశాల లోతట్టు ప్రాంతాల నుంచి ముడి సరుకులను ఓడరేవుల ద్వారా బ్రిటన్‌కు వేగంగా తరలించుకుపోవడానికి, వారి సైనిక అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న నెట్‌వర్క్ మాత్రమే. దానికోసం వలస దేశాలే బ్రిటన్‌కు రుణపడి ఉన్నాయనడం చారిత్రక సత్యాన్ని సమాధి చేయడమే.

ఇక బానిసత్వం విషయానికి వస్తే, ఆఫ్రికా మరియు కరేబియన్ దీవుల నుండి లక్షలాది మంది మనుషులను పశువుల కంటే హీనంగా రవాణా చేసి, వారి రక్తాన్ని, శ్రమను పిండి బ్రిటన్ పాలకులు తమ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. జమైకా వంటి దేశాలు నేడు ఆ గాయాలకే పరిహారం కోరుతున్నాయి. 18వ శతాబ్దపు అన్యాయాలకు 21వ శతాబ్దపు బ్రిటిష్ పౌరులను బాధ్యులను చేయలేమని బ్రవెర్మన్ అనవచ్చు. కానీ, ఒకనాటి దోపిడీ సంపదతోనే నేటి బ్రిటన్ ఆధునిక వైభవాన్ని, సామాజిక భద్రతను అనుభవిస్తోందనే నిజాన్ని విస్మరించలేం. నేడు కామన్వెల్త్ దేశాలు అడుగుతున్న పరిహారం కేవలం డబ్బుల రూపంలోనే ఉండనక్కర్లేదు; అది గతంలో జరిగిన చారిత్రక తప్పిదాలను అధికారికంగా అంగీకరించడం, క్షమాపణలు చెప్పడం మరియు నైతిక బాధ్యత వహించడం కూడా అందులో భాగమే.

భారత సంతతికి చెందిన నేతలు, తమ బ్రిటన్ దేశీయ పాలిటిక్స్‌లో తామే పెద్ద దేశభక్తులమని నిరూపించుకోవడానికి ఇలాంటి వక్రీకరణలకు పూనుకోవడం విచారకరం. వలసవాదం ప్రపంచానికి ప్రజాస్వామ్యాన్ని ఇవ్వలేదు, వలస పాలనలో శతాబ్దాల పాటు అణచివేతకు గురైన దేశాలు, సుదీర్ఘ పోరాటాల ద్వారా స్వేచ్ఛను సాధించుకుని, తమ స్వయంకృషితో నేడు ప్రజాస్వామ్యాలుగా వర్ధిల్లుతున్నాయి. గతాన్ని వక్రీకరించడం మానేసి, వలస దేశాల సంపదతోనే తమ నేటి వైభవం సాధ్యమైందనే నగ్న సత్యాన్ని బ్రిటన్ పాలకులు ఇప్పటికైనా గుర్తించడమే ఆ దేశానికి గౌరవప్రదం. నేటి ఆధునిక ప్రపంచం చారిత్రక వాస్తవాలను గౌరవించేదిగా ఉండాలి తప్ప, పాత వలసవాద క్రూరత్వాన్ని కప్పిపుచ్చేదిగా ఉండకూడదు.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

## రాయలసీమకు..
# తీరని ద్రోహం చేసింది మీరే!

### చర్చకు సిద్ధమంటూ వైసీపీ నేతలకు సోమిరెడ్డి సవాల్



రాయలసీమకు తీరని ద్రోహం చేసిన వైసీపీ నేతలకు ఆ పేరు ఎత్తే అర్హతే లేదని, కావాలంటే రాయలసీమ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. ఇటీవల ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాయలసీమ విషయంలో టీడీపీని బదనాం చేస్తే తమకు రాజకీయప్రయోజనం చేకూరుతుందని భావించిన గొడ్డలిపార్టీ రోజుకో డ్రామా ఆడుతోందన్నారు. రాయలసీమ గురించి నెల్లూరులో వైసీపీ పెట్టిన సభను ఆయన ప్రస్తావిస్తూ, వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీమకు ఖర్చుచేసింది కేవలం రూ.2 వేల కోట్లేనని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదికాలంలోనే సుమారు పాతిక వేల కోట్లతో పనులు చేపట్టిందని ఆయన అన్నారు. రౌండ్ టేబుల్ నెల్లూరులో కాదు... తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టి ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. కాలువల్లో పూడిక తీయకుండానే దొంగ బిల్లులు చేసుకున్న వ్యక్తి ఆధ్వర్యంలో ఆ సమావేశాలు జరగడం హాస్యాస్పదమన్నారు. 2020లోనే రాయలసీమ లిఫ్ట్‌పై ఎన్జీటీ స్టే విధిస్తే...వైసీపీ నేతలు ఇప్పుడు సమీక్షలు పెట్టడం సిగ్గుచేటన్నారు. ఒక్క అనంతపురం జిల్లాలో రూ.3000 కోట్లతో కూటమి ప్రభుత్వం అనేక పనులు చేపట్టిందని, హిందూపురంలోనే రూ.750 కోట్లతో పనులు చేస్తున్నారని ఆయన వెల్లడించారు. రాయలసీమను ముంచేసిందే వైసీపీ ప్రభుత్వంలోనే అని ఆయన విమర్శించారు. జగన్‌రెడ్డి పాలనలో కీలకమైన ఇరిగేషన్, అగ్రికల్చర్, ఆర్ అండ్ బీ శాఖలను నిర్వీర్యం చేశారని, బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 40 శాతం కూడా ఖర్చు పెట్టలేదన్నారు. జీఓ నెం.365 పేరుతో రాయలసీమలోని 102 ప్రాజెక్టులను జగన్‌రెడ్డి ఎందుకు రద్దు చేశారో వైసీపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు. కృష్ణానదిలో 798 అడుగుల నుంచే ముచ్చుమర్రి ద్వారా నీటిని తీసుకోవచ్చని, అయితే జగన్‌రెడ్డి దానిని పట్టించుకోకుండా ఇప్పుడు రాయలసీమ లిఫ్ట్ పేరుతో డ్రామాలాడడం విడ్డూరమన్నారు. వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రబాబునాయుడు ఒక రూపు తెచ్చారని, కృష్ణానదిలో ప్రవాహం లేకపోతే పట్టిసీమ ద్వారా 7 వేల క్యూసెక్కుల గోదావరి జలాలను లిఫ్ట్ చేస్తున్నారని, జగన్ రెడ్డి మాదిరిగా తమ ప్రభుత్వంలో దూప్‌లు ఉండవని ఆయన స్పష్టం చేశారు. వెలిగొండ ప్రాజెక్టులో టన్నెల్ పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసిన ఘనుడు జగన్ రెడ్డి అని ఆయన విమర్శించారు. ఉమ్మడి ఏపీలోనే ఏ జిల్లాలో లేని విధంగా నెల్లూరుకు 146 టీఎంసీల సామర్థ్యం కలిగిన సోమశిల, కండలేరు జలాశయాలను అందించిన ఘనత ఎన్టీఆర్ దేనని, ఏ ముఖం పెట్టుకుని నెల్లూరులో వైసీపీ నేతలు రౌండ్ టేబుల్ సమావేశాలు పెడతారని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనే వైసీపీ రాజకీయ నిరుద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశమైందని ఆయన అన్నారు. వైసీపీ నేతలు కేవలం జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం మాత్రమే చేశారని విమర్శించారు. ప్రస్తుతం రూ.35313 కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చంద్రబాబు నాయుడు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని, ఇలాంటి ముందుచూపు జగన్మోహన్‌రెడ్డికి ఉందా అని ఆయన అన్నారు.

# 40 లక్షలతో..చౌటపల్లిలో కోదండరామాలయం

### • శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు మండలం గుండెమడకల పంచాయతీ చౌటపల్లి గ్రామంలో 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న శ్రీ కోదండరామాలయానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇటీవల శాస్త్రోక్తంగా పూజలు చేసి శంకుస్థాపన చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో, టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధుల ద్వారా ఈ ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. వింజమూరు మండల కన్వీనర్ జి.నరసారెడ్డి, జి.వెంకటరమణయ్య నాయుడు, ఏ.ఓబులురెడ్డి, సి హెచ్ వెంకటరత్నారంరెడ్డి, నరసపనాయుడు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

# సమాచార హక్కు చట్టాన్ని.. కట్టుదిట్టంగా అమలుచేయాలి

### • కమిషనర్ ఒంటేరు రవిబాబు



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ ఒంటేరు రవిబాబు

సమాచార హక్కు చట్టాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమర్థవంతంగా అమలుచేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులోగా సమాచారాన్ని అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఒంటేరు రవిబాబు చెప్పారు. ఈనెల 13న ఆయన నెల్లూరు పట్టణంలోని చెముడుగుంట జెడ్పీ హైస్కూల్, పంచాయతీ కార్యాలయం, విక్రమ సింహపురి యూనివర్సిటీ, విద్యుత్ భవన్, డీఈఓ కార్యాలయం, జిల్లా పరిషత్, జిల్లా పంచాయతి కార్యాలయం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా కోర్టు, జిల్లా రిజిస్ట్రార్, డియంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, డిఎస్పీ, కలెక్టరేట్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం(ఆర్‌టిఐ) అమలుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో చట్టం అమలుకు సంబంధించి అధికారులు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించే కీలకమైన చట్టమన్నారు. ఈ చట్టం కింద అందిన దరఖాస్తులను నిర్దేశించిన గడువు లోగా పరిష్కరించి, దరఖాస్తుదారులకు పూర్తి సమాచారాన్ని అందించడం ప్రతి ప్రజా సమాచార అధికారి బాధ్యతని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి మొదటి అప్పీలేట్ అధికారి వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా బోర్డు ప్రదర్శించాలని సూచించారు. సమాచార హక్కు చట్టానికి సంబంధించిన రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ సక్రమంగా నిర్వహించాలని, చట్టంలోని నిబంధనల మేరకు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని కార్యాలయ నోటీస్ బోర్డులు, వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

# అప్పుడెందుకు గుండు గీయించుకోలేదు?



### ఉద్యోగసంఘం నేత వెంకట్రామిరెడ్డికి.. బీద సూటిప్రశ్న

ప్రభుత్వ ఉద్యోగం నుండి డిస్మిస్ అయినా, తానో ఉద్యోగ సంఘ నేతను అని చెప్పుకొనే వెంకట్రామిరెడ్డి ఇటీవల ప్రభుత్వంపై చేసిన విమర్శలు హాస్యాస్పదమని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు బీద రవిచంద్ర చెప్పారు. వెంకట్రామిరెడ్డి చేసిన విమర్శలను దృష్టిలో పెట్టుకుని ఆయనొక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఉద్యోగులను నున్నగా గుండుచేసే పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నదని ఆరోపిస్తూ, గుండు చేయించుకొని మరీ గుండు డ్రామాకు వెంకట్రామిరెడ్డి తెరలేపారని బీద విమర్శించారు. నిజానికి ఉద్యోగుల సమస్యలపై గుండు చేయించుకోవాలంటే వెంకట్రామిరెడ్డి వైసీపీ పాలనలో ప్రతి రోజూ గుండు గీయించుకొని ఉండాలన్నారు. 2019లో ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత నాటి వైసీపీ ప్రభుత్వం, తను ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, ఉద్యోగులను అడుగడుగునా వేధిస్తే, నాడు ఉద్యోగ సంఘ నేతగా ఉన్న వెంకట్రామిరెడ్డి ఎందుకు గుండు కొట్టించుకోలేదని బీద ప్రశ్నించారు.

### ఒక్క నెలైనా ఉద్యోగులకు సక్రమంగా జీతాలిచ్చారా?..

నాటి వైసీపీ పాలనలో ఉద్యోగులకు ఒక్క నెలలోనైనా, ఒకటో తేదీన జీతాలు ఇచ్చిన పాపాన పోలేదని, నాటి ప్రభుత్వం ఉద్యోగులకు వేల కోట్ల రూపాయలు బకాయిలు పెట్టినా, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ ఛైర్మన్‌గా ఉన్న వెంకట్రామిరెడ్డి వాటి గురించి ఎప్పుడైనా మాట్లాడారా! ఒక్క రోజైనా గుండు కొట్టించుకున్నారా అని బీద రవిచంద్ర నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని, గత ప్రభుత్వం ఉద్యోగులకు కోట్ల రూపాయల బకాయిలను పెండింగ్ పెట్టిందని, ఆ బకాయిలను రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం చెల్లించిందని గుర్తుచేశారు. అంతేకాక, ప్రతినెల ఒకటో తేదీన ప్రభుత్వం జీతాలు చెల్లిస్తోందన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు ఏమీ చేయకున్నా పట్టించుకోని వెంకట్రామిరెడ్డి, ఇప్పుడు తగుదునమ్మా అంటూ కూటమి ప్రభుత్వంపై విమర్శలకు దిగడం అర్థరహితమని, ఉద్యోగులకు మేలు చేస్తుంటే చూసి ఓర్చుకోలేక ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ఆయన అన్నారు.

# జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

### • 372 కేసులు, రూ.1.20 లక్షల జరిమానాలు



డ్రంక్ & డ్రైవ్ తనిఖీ చేస్తున్న పోలీసులు

నేరనియంత్రణ, రోడ్డుప్రమాదాల నివారణ, అసాంఘిక కార్యక్రమాల కట్టడిలో భాగంగా జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల ఆదేశాలతో, ఇటీవల జిల్లా పోలీసులు ఒకే రోజున జిల్లావ్యాప్తంగా ప్రధాన కూడళ్ళు, హైవేలు, శివారు ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లతో పాటు అనుమానితుల నివాసాల్లోనూ తనిఖీలు చేపట్టారు. 216 మంది పోలీసులు అధికారులు, పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నాకాబందీ తనిఖీలు చేశారు. బహిరంగ మద్యపానం చేస్తున్న వారిపై కేసులు పెట్టారు. ముమ్మరంగా వాహన తనిఖీలు చేసి, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్నవారిని గుర్తించి కేసులు నమోదు చేసి, వారి నుంచి 1,20,660 రూపాయలు జరిమానాలు వసూలుచేశారు. మొత్తంగా ఈ తనిఖీల్లో 372 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ఆర్టీసీ ప్రైవేటీకరణ వద్దనే వద్దు!

### • స్పష్టం చేసిన ఇ.యు నాయకులు

విద్యుత్‌బస్సులను ప్రవేశపెట్టాలనే సాకుతో ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు) స్పష్టం చేసింది. ఇటీవల నెల్లూరులోని ఇయు ప్రధాన కార్యాలయంలో జరిగిన ఆ యూనియన్ వజ్రోత్సవాల్లో పాల్గొన్న ఆ సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ జి.నారాయణరావు మాట్లాడుతూ, విద్యుత్‌బస్సులకు తాము వ్యతిరేకం కాదని, అయితే ఆ బస్సులను ఆర్టీసీయే స్వయంగా నడపాలని కోరారు. ఆర్టీసీలో ఇప్పటికే ఖాళీగా ఉన్న సుమారు 10వేల పోస్టులను భర్తీచేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోనల్ కార్యదర్శి డి.బాబూశామ్యూల్, జిల్లా నాయకులు ఓ.వి ప్రసాద్, కె.లక్ష్మన్, ఎస్‌కె జిలానీ, బీవీస్ రావు, మల్లికార్జున, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 6 కోట్ల సొంత నిధులతో..
# విద్యార్థులకు సైకిళ్ళు
### మంత్రి నారాయణ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ హైస్కూళ్లలో చదువుతున్న 7వేల మంది విద్యార్థుల కోసం మంత్రి నారాయణ కుటుంబ సభ్యుల సొంత నిధులు 6 కోట్ల రూపాయల భారీ వ్యయంతో కొనుగోలు చేసిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి స్థానిక వీఆర్సీ మైదానం ముస్తాబవుతోంది. ఈ నెల 20వ తేదీ సోమవారం 7 వేల మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమ ఏర్పాట్లను మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మంగళవారం రాత్రి స్వయంగా పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. నెల్లూరు ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి సీఎస్ఆర్ నిధులు లేకుండా, కేవలం మంత్రి నారాయణ కుమార్తెలు షరణి, సింధు, మరియు అల్లుళ్ల సొంత ఆదాయం నుండి ఈ సైకిళ్లను కొనుగోలు చేశామన్నారు. భవిష్యత్తులో 7వ తరగతి పూర్తి చేసుకుని 8వ తరగతికి వచ్చే మరో 3వేల మంది పిల్లలకు కూడా సైకిళ్లు అందజేస్తామని, మొత్తం 10,000 సైకిళ్లను తమ కుటుంబం పంపిణీ చేయనుందని మంత్రి తెలిపారు. నెల్లూరు నెక్లెస్ రోడ్డుకు 50 కోట్లు, పినాకిని పార్కుకు 50 కోట్ల నిధులను ముఖ్యమంత్రిని అడిగి మంజూరు చేయించానని వెల్లడించారు. కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## జానకమ్మకి..రచయిత్రుల నివాళి


ఎస్.జానకికి నివాళులర్పిస్తున్న నరసం సభ్యులు


ప్రముఖ సినీగాయని ఎస్.జానకి మృతి బాధాకరమంటూ నెల్లూరు జిల్లా నవ్యాంధ్రుల రచయిత్రుల సంఘం (నరసం) వారు పేర్కొంటూ, జానకమ్మని స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. స్థానిక అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న విఖ్యాత గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రా దేవి మాట్లాడుతూ, మధురగాయని ఎస్ జానకి పాటల వైశిష్ట్యాన్ని వివరించారు. ఆ మహాగాయని దక్షిణ భారతదేశానికే గర్వ కారణమన్నారు. అనేకభాషల్లో అతి మధురంగా పాటలు పాడిన ఆమె ప్రపంచవ్యాప్తంగా పెద్దసంఖ్యలో అభిమానులను సంపాదించుకున్నారన్నారు. ఎలాంటి క్లిష్టమైన పాటలైనా అవలీలగా పాడే గానకోకిల ఎస్.జానకి అని, ఆమెకి సరస్వతీదేవి కటాక్షం మెండుగా ఉందన్నారు. చేజెర్ల వినయ, నజ్మా, సందడి అరుణ, గాయత్రి, జయలక్ష్మి, సుందరి, ఏ.భారతి తదితరులు జానకి పాడిన పాటలు పాడి ఆమెకి నివాళులర్పించారు. శ్రీలత, సాయిరామ్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

## అమరావతి క్రీడలను
# విజయవంతం చేయాలి
### డిఆర్ఓ విజయకుమార్


అధికారులతో సమీక్షిస్తున్న డిఆర్ఓ విజయకుమార్

'అమరావతి చాంపియన్‌షిప్-2026' క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్‌లో ఆ క్రీడల నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి చాంపియన్షిప్-2026లో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావడానికి అన్ని శాఖలు సమష్టిగా కృషిచేయాలన్నారు. అండర్-17, అండర్-23 బాలురు, బాలికల విభాగాల్లో మొత్తం 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జులై 15 నుంచి 25 వరకు నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు, జులై 26 నుంచి ఆగస్టు 10 వరకు జిల్లా స్థాయి అంతర్-నియోజకవర్గ పోటీలు, ఆగస్టు 20 నుంచి 26 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు, ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు బాగుండాలని ఆయన ఆదేశించారు.

## 24 వరకు..'సర్' పొడిగింపు!

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువు తేదీని ఈనెల 24 వరకు పొడిగించడంతో, ఇప్పటివరకు పనివత్తిడితో ఉన్న బీఎల్ఓలు ఊపిరిపీల్చుకున్నారు. తాజాగా ఎన్నికల కమిషన్ ఆదేశాలతో, ఓటర్ల డిజిటలైజేషన్‌కి, ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకునేందుకు తగు వెసులుబాటు కలిగిందని భావిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఈనెల 14వ తేదీ నాటికి19,67,957 పత్రాలను డిజిటలైజ్ చేశారు. మొత్తం 19,74,240 ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేసివున్న నేపథ్యంలో, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియ 99.68 శాతం పూర్తయినట్లు అధికారులు చెప్తున్నారు. ఆత్మకూరు, నెల్లూరు సిటీ, సర్వేపల్లి నియోజకవర్గాల్లో నూటికి నూరుశాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. నెల్లూరు రూరల్‌లో 98శాతం, కావలి, కోవూరు, గూడూరు, ఉదయగిరిలలో 99 శాతం పూర్తయినట్లు సమాచారం. ఇంకా ఎవరైనా ఎన్యూమరేషన్ పత్రాలు తీసుకోకపోయినా, తీసుకున్నవి పూర్తిచేసి ఇవ్వకపోయినా, గడువు పొడిగించారు కనుక వెంటనే వాటని పూర్తిచేసి ఇవ్వాలని, బాధ్యతగా ఓటు హక్కును కాపాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## నేత్రపర్వంగా..పుష్పయాగం



నెల్లూరులోని వేదాయపాళెంలో వెలసివున్న శ్రీ మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇటీవల స్వామివారికి కన్నులపండువగా పుష్పయాగం నిర్వహించారు. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి స్నపన తిరుమంజనం, ఆలయ కోనేరులో చక్రస్నానం, హయగ్రీవ హోమం, శాత్తుమురై అనంతరం అన్న ప్రసాద వినియోగం జరిగాయి. సాయంత్రం మహా పూర్ణాహుతి, ద్వాదశ ఆరాధన, పుష్పయాగం, ధ్వజ అవరోహణ, కుంభ ప్రోక్షణ కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం పర్యవేక్షణలో ఈ వేడుకలు వైభవంగా జరిగాయి.

### టౌన్‌ప్లానింగ్ అదనపు డైరెక్టర్‌గా హిమబిందు

నెల్లూరు నగరపాలక సంస్థలో స్వర్ణ, వార్డు, గ్రామ సచివాలయాల అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న కె.హిమబిందుకు ప్రభుత్వం ఇటీవల ఉద్యోగోన్నతి కలిగిస్తూ టౌన్‌ప్లానింగ్ అదనపు డైరెక్టర్‌గా నియమించింది.

# 'అపస్మా' సేవలు అభినందనీయం


సత్కారాన్నందుకుంటున్న ఎంఇఓ తిరుపాల్

తెలుగు భాషాభివృద్ధికి అపస్మా (ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్న కృషి అభినందనీయమని నెల్లూరు మండల విద్యాశాఖ అధికారి (ఎంఇఓ) తిరుపాల్ అభినందించారు. ఇటీవల అపస్మా నేతృత్వంలో ప్రైవేటు పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులకు రెండురోజుల పాటు నెల్లూరు రోటరీ క్లబ్‌లో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఇఓ మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం మాత్రమే ఉంటుందని, అయితే అపస్మాకి చెందిన పాఠశాలల్లో తెలుగును విస్మరించకుండా ఇంగ్లీషుతో పాటు తెలుగును కూడా బోధించడం సంతోషదాయకమని ప్రశంసించారు. అనంతరం అపాస్మ నాయకులు ఎంఇఓను సన్మానించారు. జిల్లా అపస్మా అధ్యక్షులు నేలనూతల శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణా తరగతుల్లో జిల్లాలోని 104 పాఠశాలల నుండి 256 మంది తెలుగు ఉపాధ్యాయులు పాల్గొనడం విశేషం. అపస్మా రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి కృష్ణారావు, నెల్లూరు నగర అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, రమేష్, అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు.

# విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి


ఎస్ఇ రాఘవేంద్రం

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ కె.రాఘవేంద్రం వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పెద్దఎత్తున డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వినియోగదారులు తమ ఇళ్ళనుంచే విద్యుత్ బిల్లులు సునాయాసంగా చెల్లించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అందుకు ఏపీఎస్‌పీడీసీఎల్ పలు ఆన్‌లైన్ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చిందని, వినియోగదారులు తమ విలువైన సమయాన్ని ఆదా చేసుకుంటూ, రవాణా ఖర్చులు, ఇతర ఇబ్బందులు లేకుండా బిల్లులు చెల్లించవచ్చని వివరించారు. బిల్లు జారీచేసిన తేదీ నుండి 14 రోజుల లోపల బిల్లులు చెల్లించకపోతే ఆలస్యానికి అదనపు చార్జీ ఉంటుందని, నెలరోజులు దాటితే దాంతోపాటు మరో వంద రూపాయల ఆర్‌సీ ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అదనపు చార్జీలు పడకుండా, డిజిటల్ పేమెంట్స్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### విద్యుత్ కార్యాలయ చిరునామా మారింది..

నెల్లూరు రూరల్ మండల పరిధిలో ఉన్న నారాయణరెడ్డిపేట, బుజబుజనెల్లూరు, కావేరినగర్‌ల విద్యుత్ సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు సంబంధించి కోటమిట్టలో ఉన్న నెల్లూరు రూరల్ విద్యుత్ రెవెన్యూ కార్యాలయం, విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవాలయం ఎదురుగా ఉన్న విద్యుత్ భవన్ ప్రాంగణంలోని నూతన కార్యాలయానికి మారిందని రూరల్ డివిజన్ ఏఇ ఎల్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ మార్పును గమనించి సంబంధిత సేవలను నూతన కార్యాలయంలో పొందాల్సిందిగా విజ్ఞప్తిచేశారు.

## డా.పెళ్లకూరు జయప్రద రచించిన..
# 'యుద్ధం' కథాసంపుటి ఆవిష్కరణ


'యుద్ధం' కథాసంపుటిని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

విజయవాడలో ఇటీవల జరిగిన 3వ ప్రపంచ తెలుగు రచయిత్రుల మహాసభలో, పూర్ణచందు ఆధ్వర్యంలో నెల్లూరుజిల్లాకి చెందిన ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి రచించిన 'యుద్ధం' కథా సంపుటిని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి, పూర్వమంత్రి సన్నపనేని రాజకుమారి, సాహితీ వేత్తలు మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని, రచయిత్రి జయప్రదను అభినందించి సన్మానించారు.



## ముఖ్యమంత్రి సమక్షంలో.. మంత్రి ఆనం పుట్టినరోజు వేడుకలు

రైతు పక్షపాతిగా.. నెల్లూరు జిల్లా అభివృద్ధి ప్రదాతగా... ప్రజల మనిషిగా పేరొందిన రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జన్మదిన వేడుకలు ఈనెల 10న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వైభవంగా జరిగాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఆయన పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ముఖ్యమంత్రి స్వయంగా కేక్ కట్ చేయించి, మంత్రి ఆనంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మంత్రులు పాల్గొని, మంత్రి ఆనం ప్రజాసేవా రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ‘శ్రీసిటీ’ బ్రాండ్‌కి.. ప్రత్యేక ఆకర్షణ తెచ్చిన లోకేష్

- ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు



సిఐఐ ఏపీ ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్

పెట్టుబడుల ఆకర్షణలో భాగంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, హెచ్ఆర్‌డీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ఈ నెల 5 నుంచి 11 వరకు సాగిన దక్షిణ కొరియా పర్యటనకు విశేష స్పందన రాగా, వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పెట్టుబడిదారుల చర్చల్లో శ్రీసిటీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. శ్రీసిటీని ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా ప్రముఖ కొరియా కంపెనీలు, పరిశ్రమల సమాఖ్యలు, ప్రభుత్వ సంస్థలకు సమర్థవంతంగా పరిచయం చేసిన మంత్రి నారా లోకేష్‌కు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సియోల్, బుసాన్ నగరాల్లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశాల్లో శ్రీసిటీని ప్లగ్–అండ్–ప్లే పారిశ్రామిక హబ్‌గా మరియు ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, డిస్‌ప్లే తయారీ, ఎలక్ట్రిక్ వాహన భాగాలు, అధునాతన తయారీ, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశ్రమలు, సముద్ర సాంకేతిక రంగాలకు అత్యంత అనువైన కేంద్రంగా మంత్రి లోకేష్ వివరించినట్టు వెల్లడించారు. కొరియా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రత్యేక టౌన్‌షిప్ ఏర్పాటుకు శ్రీసిటీని అనువైన కేంద్రంగా ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. ఈ పెట్టుబడుల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు, కొరియా ట్రేడ్–ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ, భారత పరిశ్రమల సమాఖ్య తదితర భాగస్వామ్య సంస్థలకు డా. సన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## పవన్‌ను పరామర్శించిన మంత్రి నారాయణ



ముంబయి ఆసుపత్రిలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అదివారం పరామర్శించారు. పవన్‌కళ్యాణ్‌తో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నారాయణతో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్ పవన్‌కళ్యాణ్ ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని మంత్రి నారాయణ ఆకాంక్షించారు.






డా. చిల్లకూరు మోహన్‌రెడ్డి గారు

జననం : 23.06.1936 నిర్యాణం : 22.07.2020

# శ్రద్ధాంజలి

నిరంతర సేవాతత్పరులు, నిస్వార్ధ ప్రజాసేవకులు,
ఎందరికో స్ఫూర్తిప్రదాతలు, మాకు మార్గదర్శకులు

**డా. చిల్లకూరు మోహన్‌రెడ్డి గారు**

పరమపదించి తే. 22.07.2026ది నాటికి
ఆరేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ మహనీయుని స్మరించుకుంటూ...

తమ్ముడు - మరదలు
**ఆచార్య సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై**

తమ్ముని కుమారుడు - కోడలు
**డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై**

తమ్ముని కుమార్తె - అల్లుడు
**శ్రీమతి హారిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ**

తమ్ముని మనుమలు.. మనుమరాండ్రు
**జయేష్ & అష్మిత ఆకాష్ కీర్తన లక్ష్మి & తనవ్**

# విదేశాల్లో చదువు : అవకాశాలు, సిద్ధత విజయానికి మార్గదర్శిని!

విద్య మనిషిని ప్రపంచ పౌరుడిగా తీర్చిదిద్దే శక్తి. 'విద్యా బలం విజయం' అనే భావన ఇప్పటి ప్రపంచానికి మరింత అన్వయం. జ్ఞానం, నైపుణ్యం, వేగం, అనుకూలత.. ఇవే. అవకాశాలను తెరుస్తున్న యుగం ఇది. భారతీయ యువతకు విదేశాల్లో చదువు ఒక కల మాత్రమే కాదు..సరైన సిద్ధతతో ముందడుగువేస్తే అది సాధ్యమైన ప్రయాణం. అయితే ఈ ప్రయాణం స్వప్నం, శ్రమ, వ్యూహం, నిజాయితీ అనే నాలుగు స్తంభాలపై నిలబడాలి. స్వప్నం దిశను చూపుతుంది, శ్రమ మార్గాన్ని నిర్మిస్తుంది, వ్యూహం అవకాశాలను తెరుస్తుంది, కానీ నిజాయితీ మాత్రమే ఈ ప్రయాణాన్ని నిలబెడుతుంది. ఇటీవలి కాలంలో అనేకమంది విద్యార్థులు దరఖాస్తుల నుంచి వ్యాసం వరకు, ఇంటర్వ్యూల నుంచి వీసా ప్రక్రియ వరకు ప్రతి దశలో తేలికపాటి దారులు (short cuts) వెతుకుతున్న దృశ్యం కనిపిస్తోంది. 'నిజాయితీ లేకుండా నిలిచే విజయం లేదు' అనే సూక్తి విదేశీ విద్యా ప్రయాణానికి అచ్చం సరిపోతుంది. విదేశాల్లో చదువు సులభం కాదు, చౌక కాదు, తక్షణ ఫలితాలు ఇవ్వదు. ఇది ఒక దీర్ఘకాల పెట్టుబడి, దానికి సరైన ప్రణాళిక అవసరం. కానీ నిజం చెప్పాలంటే..విదేశాల్లో చదువు ఒక 'అవకాశం' మాత్రమే; అది "హామీ" కాదు. "ఉద్యమేన హి సిధ్యంతి కార్యాణి" అనే సూక్తి ఇక్కడ అచ్చం వర్తిస్తుంది. అంటే ఏ పని అయినా కేవలం కోరికతో కాదు; నిరంతర శ్రమ, పట్టుదల, కృషి ఉంటేనే అది పూర్తవుతుంది.

**అవకాశాలు : ప్రపంచ విద్యా వ్యవస్థలు తెరిచిన మార్గాలు :**

అమెరికా విద్యావ్యవస్థలో "థింక్ బిగ్" అనే భావన బలంగా ఉంటుంది. పరిశోధన, సాంకేతికత, స్వేచ్ఛ..ఈ మూడు అమెరికా విద్యకు పునాది. విజ్ఞాన-సాంకేతికరంగాలు (STEM), కృత్రిమ మేధస్సు (AI), రోబోటిక్స్, బిజినెస్ అనలిటిక్స్, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో ప్రపంచ స్థాయి అవకాశాలు ఉన్నాయి. ఇటీవలి సంవత్సరాల్లో ప్రపంచ ఉద్యోగ పరిస్థితులు మారుతున్నాయి. "కాలమే మార్పుకు మూలం" అనే సూక్తి చెప్పినట్లే, సాంకేతికత, కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ ఇవన్నీ ఉద్యోగ దిశలను మారుస్తున్నాయి. అమెరికాలో గతంలో భారీగా H1B వీసాలు పొందిన రంగాల్లో ఇప్పుడు స్థానిక ప్రతిభను ప్రోత్సహించే ధోరణి పెరిగింది. భారతదేశంలో వేగంగా పెరుగుతున్న గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (GCCs) అనేక కంపెనీలను స్థానికంగా నియామకాలు చేయడానికి ప్రోత్సహిస్తున్నాయి. ఫలితంగా, విదేశాల్లో చదివి ఉద్యోగం పొందే మార్గం మరింత పోటీతో, మరింత పరిశీలనతో మారింది. వలస విధానాలు కూడా కఠినతరం అవుతున్నాయి; "అవకాశం ఉన్న చోట అడ్డంకి కూడా ఉంటుంది" అనే మాట ఇప్పుడు మరింత నిజమవుతోంది.

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

**సిద్ధత : విదేశాల్లో చదువు ఒక ప్రాజెక్ట్:**

విదేశాల్లో చదువు ఒక సులభమైన మార్గం కాదు; ఇది ఒక కఠినమైన, నిరంతర శ్రమను కోరే ప్రయాణం. సిద్ధతే విజయానికి మొదటి అడుగు. ఈ ప్రయాణాన్ని నిజంగా ముందుకు తీసుకెళ్లాలంటే, విదేశాల్లో చదువును ఒక ప్రాజెక్ట్లా చూడాలి. విద్యా సిద్ధత, ఆర్థిక సిద్ధత, మానసిక సిద్ధత, నైపుణ్య సిద్ధత.. ఈ నాలుగు స్తంభాలు బలంగా ఉండాలి. తేలికపాటి దారులు (short cuts) ఈ ప్రయాణంలో లేవు; ఉన్నా, అవి నిలబెట్టవు. విద్యా సిద్ధతలో మంచి విద్యా రికార్డు, GRE/GMAT/SAT/IELTS/ TOEFL వంటి పరీక్షల్లో పోటీ స్థాయి స్కోర్లు, కోర్సు పనితీరు, స్వయంగా చేసిన చిన్న ప్రాజెక్టులు, సాంకేతిక నైపుణ్యాలు మరియు నేర్చుకునే తపన, ఇవన్నీ ముఖ్యమే. ఆర్థిక సిద్ధత అత్యంత ముఖ్యమైనది. విదేశాల్లో చదువు దాదాపు 30 నుండి 60 లక్షల ఖర్చుతో కూడుకున్నది. మానసిక సిద్ధత కూడా అంతే ముఖ్యమైనది. విదేశాల్లో జీవితం ఒంటరితనం, వాతావరణ మార్పు, సంస్కృతి భేదాలు, చదువు.. పనిఒత్తిడి లాంటివి విద్యార్థిని కట్టిపడేస్తాయి. "ఒంటరితనం కూడా ఒక గురువు" అనే మాట విదేశాల్లో చదివే ప్రతి విద్యార్థి నేర్చుకునే పాఠం. ఈ ప్రయాణంలో మానసిక స్థిరత్వం ఒక ఆయుధం; నైపుణ్య సిద్ధతలో కమ్యూనికేషన్, నెట్వర్కింగ్, సమయ నిర్వహణ..ఇవన్నీ అత్యంత కీలకం. విదేశాల్లో "Networking is Net Worth" అనే మాట నిజమవుతుంది.

**విదేశాల్లో చదువు..కల కాదు, కర్తవ్యంతో కూడిన ప్రయాణం :**

విదేశాల్లో అవకాశాలు ఉన్నా, సవాళ్లు కూడా ఉంటాయి. ఉద్యోగాలు హామీ కాదు. విద్యార్థినైపుణ్యాలు, ఇంటర్న్షిప్‌లు, నెట్వర్కింగ్, ప్రాజెక్టులు..అన్నీ అత్యంత ముఖ్యమైన అంశాలు. "అవకాశం కోసం ఎదురు చూడాలి, కానీ సిద్ధతతో ఉండాలి" అనే సూక్తి ఇక్కడ వర్తిస్తుంది. వీసా సవాళ్లు కూడా ఉంటాయి. విదేశాల్లో చదువు కోసం ముందస్తు పరిశోధన మరియు సమగ్ర ప్రణాళిక అత్యంత కీలకం. లక్ష్యం విశ్వవిద్యాలయం, ఎంపిక చేసిన కార్యక్రమం, దరఖాస్తు సమయం గురించి ముందుగానే లోతుగా తెలుసుకోవడం ద్వారా, విద్యార్థి సమయాన్ని సక్రమంగా వినియోగించు కోవచ్చు. అంతేకాక, విశ్వవిద్యాలయం అందించే ఆర్థిక సహాయంపొందే అవకాశాలు కూడా పెరుగుతాయి. H1B, Skilled Migration, గ్రీన్ కార్డు (PR).. ఇవి పోటీతో కూడిన మార్గాలు. జీవన వ్యయం కూడా ఎక్కువ. విద్యార్థి సమతుల్యత నేర్చుకోవాలి. విదేశాల్లో చదువు ఒక జీవిత మార్పు. అవకాశాలు అపారంగా ఉన్నాయి, కానీ సిద్ధత లేకపోతే కష్టం. భారతీయ విద్యార్థులు ప్రపంచాన్ని గెలుచుకునే సామర్థ్యం కలవారు. సరైన ప్రణాళిక, సరైన దిశ, సరైన శ్రమ ఉంటే, విదేశాల్లో చదువు భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుంది. ఏ లక్ష్యం అయినా కేవలం కోరికతో కాదు; నిరంతర శ్రమ, పట్టుదల, కృషి ఉంటేనే అది పూర్తిగా నెరవేరుతుంది.



**వచ్చే వారం :** విద్యార్థులు తప్పక తెలుసుకోవాల్సిన విదేశీ విద్యా వేతనాలు

E-mail: reddyu@gmail.com

# 120వ సారి..అజయ్‌బాబు రక్తదానం



120వ సారి రక్తదానం చేస్తున్న అజయ్‌బాబు

నెల్లూరు రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ మాజీ కన్వీనర్ మరియు రక్తదాత సి.హెచ్.అజయ్‌బాబు ఈనెల 11న స్థానిక రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో 120వ సారి రక్తదానం చేసి, సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డా. వరప్రసాద్ మాట్లాడుతూ, స్వచ్ఛంద రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను కాపాడి, ప్రాణదాతగా నిలవవచ్చని తెలిపారు. రక్తదానం పూర్తిగా సురక్షితమైనదని, రక్తదానం చేసిన కొద్ది రోజుల్లోనే శరీరంలో కొత్త రక్తకణాలు ఏర్పడి ఆరోగ్యం మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుంటూరు జిల్లా జైలు సూపరింటెండెంట్ ఏ.బి. కాంతరాజ్ మాట్లాడుతూ, 120వ సారి రక్తదానం చేయడం ద్వారా అజయ్‌బాబు సమాజానికి ఆదర్శప్రాయమైన సేవలందించారని కొనియాడారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు జీవనదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. అజయ్‌బాబును రెడ్ క్రాస్ నెల్లూరుజిల్లా శాఖ మాజీఛైర్మన్ డా ఏ.వి.సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.



## జొన్నవాడలో..
# నందీశ్వరునికి పూజలు

బహుళ త్రయోదశిని పురస్కరించుకుని ఆదివారం నాడు బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ కామాక్షమ్మవారి దేవాలయంలోని అధికార రాతి నందీశ్వరునికి ప్రదోషకాల వృషభార్చనను వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదపండితులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు కె.శ్రీనివాసులు తదితరులు పర్యవేక్షించారు.

# యూరియాకి ఎలాంటి కొరత లేదు

## • కలెక్టర్ హిమాన్షు స్పష్టీకరణ

జిల్లాలో యూరియా ఎరువులకు ఎలాంటి కొరత లేదని, రైతులు ఆందోళన చెందకుండా తమ వ్యవసాయ పనులను నిశ్చింతగా కొనసాగించవచ్చని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పష్టం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ (2026-27) సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన, అన్ని రకాల పంటలకు అవసరమైన యూరియా పంపిణీకి జిల్లా యంత్రాంగం ప్రణాళికను సిద్ధం చేసిందన్నారు. జిల్లాలో సాగు అవసరాలకు అనుగుణంగా ఇప్పటి వరకు 34,675.394 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి జిల్లాలో 15,778.814 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. గడిచిన నెల రోజుల్లో 18,896.58 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరిందని, జిల్లా వ్యాప్తంగా జూన్ 8వ తేదీ నుండి ఇప్పటివరకు 56,275 మంది రైతులకు 17,321.67 మెట్రిక్ టన్నుల యూరియాను విక్రయించడం జరిగిందని వివరించారు. ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు బస్తాపై ముద్రించిన గరిష్ట చిల్లర ధరను రైతులు తప్పకుండా పరిశీలించాలని, నిర్ణీత ధర కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించరాదని కలెక్టర్ సూచించారు. అంతేకాక, కొనుగోలు చేసిన ప్రతిసారీ అధికారిక డీలర్ నుండి తప్పనిసరిగా పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) మెషిన్ ద్వారా వచ్చే రశీదును అడిగి తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎవరైనా డీలర్లు లేదా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించినా, నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించినా, లేదా యూరియా నిల్వలను అక్రమంగా వేరే ప్రాంతాలకు మళ్లించినా సహించేది లేదని, కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో యూరియా నిల్వలు, విక్రయాలపై నిరంతరం తనిఖీలు చేపట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను కూడా ఏర్పాటుచేసినట్లు ఆయన చెప్పారు.

# జెండాదిబ్బలో కార్డెన్ సర్చ్!

## • సరైన పత్రాలు లేని 24 వాహనాలు స్వాధీనం



స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

సంగం మండలం జెండాదిబ్బ గ్రామంలో పోలీసులు ఈనెల 13న కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. సంగం సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ భోజ్యానాయక్, ఏఎస్‌పేట ఎస్ఐ జిలాని, పోలీసు సిబ్బంది కలసి గ్రామంలోని అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని రౌడీషీటర్ల ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు చేసి, వారి వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 22 మోటార్‌సైకిళ్ళు, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంచేందుకు, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని సీఐ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, గంజాయి, జూదం తదితర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే తమకు సమాచారం అందించాలని, నేరనియంత్రణకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

# వైసీపీ వికృత రాజకీయాలు మానుకోవాలి



జనసేనాని గునుకుల ధ్వజం

వైసీపీ వికృత రాజకీయాలని అందరూ ఖండించాలని జనసేన నాయకుడు గునుకుల కిషోర్ చెప్పారు. ఇటీవలి కాలంలో కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాలు, బహిరంగ వేదికల ద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తుండగా, వాటిని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సమర్థిస్తుండడం దారుణమని ఆయన ధ్వజమెత్తారు. ఇకనైనా వైసీపీ నాయకులు తమ తీరు మార్చుకోవాలన్నారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై ప్రతిపక్షం నిర్మాణాత్మకంగా ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమని, అయితే ప్రతి సంఘటనకు కులం, మతం అనే రంగులు పులిమి సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో చోటు చేసుకున్న అనేక ఘటనలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుల, మత కోణంలో చూపిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. కొంతమంది వ్యక్తులు హిందూ దేవతలపై, జాతీయ నాయకులపై, దేశ సార్వభౌమత్వంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సందర్భాల్లో కూడా వైసీపీ నాయకులు వారిని సమర్థించేలా మాట్లాడడం ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. కుల, మత విభజనలు లేని సమాజ నిర్మాణమే తమ నాయకుడు పవన్ కళ్యాణ్ లక్ష్యమని, ఆ దిశలోనే సమాజంలో ఐక్యత, సమానత్వం, సామరస్యాన్ని పెంపొందించే విధంగా పనిచేస్తున్నారని ఆయన అన్నారు.

# సమాజసేవాభిలాషి.. కంచి పరమేశ్వరరెడ్డి

● రావలకొల్లు గ్రామంలో ఆర్ఓ ప్లాంట్

నిత్యాన్నదాత.. సమాజసేవాపరాయణుడు..కంచి పరమేశ్వర రెడ్డికి ఇటీవల ఆయన అత్తగారి ఊరైన రావలకొల్లు గ్రామంలో సన్మానం జరిగింది. రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులంతా అభిమానంతో పాల్గొని ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజల కోసం తన దాతృత్వంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంటును ప్రారంభించి, గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ, కంచి పరమేశ్వరరెడ్డి సేవలు అపారమన్నారు. గత కొన్నేళ్లుగా ఆత్మకూరు నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా ఆయన నిర్వహిస్తున్న అన్నదానం, విద్య, వైద్యం, సామాజిక సంక్షేమం తదితర సేవా కార్యక్రమాలను ప్రస్తావిస్తూ కంచి సామాజిక సేవలు ఎనలేనివని ప్రస్తుతించారు. అనంతరం కంచి పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ, "రాజకీయాలు ఎన్నికల వరకు మాత్రమే పరిమితం కావాలని, మిగతా సమయంలో గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమమే అందరి లక్ష్యంగా ఉండాలని తెలిపారు. ఆర్థికంగా స్థోమత ఉన్న ప్రతిఒక్కరూ తమకు చేతనైనంత మేరకు సేవ కార్యక్రమాలు నిర్వహించి గ్రామాభివృద్ధి కోసం సహకరించాలని, అలాచేస్తే ప్రతి గ్రామం ఆదర్శ గ్రామంగా ఎదుగుతుందని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలంతా ఐక్యంగా ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ఈ గ్రామ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటా'నని ఆయన హామీ ఇచ్చారు.


ఆర్ఓ ప్లాంటుని ప్రారంభిస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

## శ్రీసిటీని సందర్శించిన..
# పరిశ్రమల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్


తాజా, మాజీ డీసీఐఎఫ్ లతో శ్రీసిటీ ప్రతినిధులు

ఈనెల 11న తిరుపతి రీజియన్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (డీసీఐఎఫ్) మురళీకృష్ణ శ్రీసిటీని సందర్శించారు. మాజీ డీసీఐఎఫ్ వి.రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన శ్రీసిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రతినిధులు వారికి స్వాగతం పలికి, పారిశ్రామిక ప్రగతి, తాజా అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి కేవలం ఉత్పాదకతపైనే ఆధారపడదని, ఉద్యోగుల భద్రత, సంక్షేమం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రతి పరిశ్రమలో బలమైన భద్రతా సంస్కృతి నెలకొల్పినప్పుడే దీర్ఘకాలిక విజయాన్ని సాధించ వచ్చన్నారు. మాజీ డీసీఐఎఫ్ వి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, భద్రతా ప్రమాణాలు, నిబంధనల అమలులో శ్రీసిటి పరిశ్రమలు ఆదర్శంగా నిలుస్తాయని ప్రశంసించారు.

# అగ్నిబాధిత కుటుంబానికి.. రెడ్‌క్రాస్ చేయూత

ముత్తుకూరు మండలంలోని పిడతాపోలూరు ఎస్టీ కాలనీకి చెందిన నిరుపేద గిరిజనుడైన శేషయ్య ఇంట్లో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగి, ఆ కుటుంబం ఇబ్బందుల్లోపడింది. ఆ సమాచారం తెలుసుకున్న రెడ్‌క్రాస్ సొసైటీ-జిల్లాశాఖ వారు వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి అవసరమైన వస్తు సామగ్రిని, నిత్యావసర సరుకులను అందజేశారు. కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంటిలోని సామగ్రి అగ్నికి ఆహుతైపోవడంతో, ఆ పేద కుటుంబం దీనస్థితికి చేరింది. రెడ్ క్రాస్ మాజీ మేనేజింగ్ కమిటీ సభ్యులు యాలమూరి రంగయ్యనాయుడు బాధిత కుటుంబానికి 5వేల రూపాయలు అందజేశారు. నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రి మేనేజర్ గురుప్రసాద్ బాధితులను పరామర్శించి, వారికి దుస్తులను విరాళంగా అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ జిల్లా కార్యదర్శి పి.మస్తానయ్య, రెడ్ క్రాస్ ఫీల్డ్ ఆఫీసర్ డి.సుందరరాజు, మాజీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, మాజీ వైస్‌ఛైర్మన్ చమర్తి జనార్ధన్ రాజు తదితరులు పాల్గొని బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు.


బాధిత కుటుంబానికి వస్తుసామాగ్రిని అందజేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

## బీసీ కార్పొరేషన్
# ఇ.డి.గా డా.వెంకటేశ్వర్లు


బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇ.డి)గా పశుసంవర్ధకశాఖలో అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్‌గా ఉన్న డా. కె.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఆ స్థానంలో పని చేస్తున్న డాక్టర్ నిర్మలాదేవి ఇటీవల మాతృశాఖ.. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ కావడంతో ఆయన్ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

# గూడూరు డివిజన్

## పేదలకు సొంతింటిని..
# అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ పాశిం

ఇళ్ళు లేని పేదలకు సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 13వ తేదీ గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్దిదారులకు పొజిషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల కోట మండలం చంద్రశేఖరపురం గ్రామం వద్ద బస్సు ప్రమాదంలో మృతి చెందిన మృతుని కుటుంబసభ్యులకి రూ.6 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, లీలావతి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


పొజిషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్


అమరావతిలోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఇటీవల జరిగిన ఎస్టిమేషన్ కమిటీ సమావేశంలో పాల్గొని నియోజకవర్గం అభివృద్ధికి పలు సమస్యలను కమిటీ ద్వారా సంబంధిత శాఖ వాళ్ళకి తెలపాలని కమిటీ సభ్యులను కోరుతున్న గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్


'సర్' ప్రక్రియను మూడు నెలలు పొడిగించాలని కోరుతూ ఈ నెల 13వ తేదీ ఆర్డీవో అరుణకుమారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్, జమాలుల్లా తదితర నాయకులు.

# లయన్స్ సేవా కార్యక్రమాలు


విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ని అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

2026-27 గూడూరు లయన్స్ క్లబ్ కార్యవర్గ పదవీ ప్రమాణస్వీకారోత్సవం ఇటీవల గూడూరులో జరిగింది. క్లబ్ అధ్యక్షుడుగా కలగట్ల శివయ్య, కార్యదర్శిగా పప్పు వీరేంద్రనాథ్, కోశాధికారిగా ఆర్.రవిచంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ కోశాధికారి రవిచంద్ర ఆర్థిక సహకారంతో మహిళ జీవనోపాధికి కుట్టుమిషన్, శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు 5 బెంచీలు, యూనిఫాంల కోసం ఉపాధ్యాయులకి 25వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. జోన్ 12 ఛైర్మన్ రూపేష్ సహకారంతో బి.టెక్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థికి ల్యాప్‌టాప్, ఫీడ్ ది హంగర్ కార్యక్రమంలో భాగంగా పేదలకు పల సరుకులు అందజేయడం జరిగింది. అలాగే యన్.సుబ్బారావు హెచ్‌పివి వ్యాక్సిన్ కోసం 5,116 రూపాయలు అందించారు. డి.ఎస్.కుమార్, కె.చిన్నపరెడ్డి, ఆర్వీ రావు, యస్.యస్.వి.రామమోహన్ రావు, కె.ఆదిశేషారెడ్డి, ఫాస్ట్ రీజియన్ ఛైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

అదేవిధంగా, లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ క్లబ్ ప్రెసిడెంట్‌గా పి.గోపినాథ్‌రెడ్డి, సెక్రటరీగా కావేరి, ట్రెజరర్‌గా గాలి శివరాంలు, టౌన్ క్లబ్ ప్రెసిడెంట్‌గా పి.ప్రసాద్, సెక్రటరీగా రాజేంద్రప్రసాద్, ట్రెజరర్‌గా బషీర్‌లు, వెస్ట్‌క్లబ్ ప్రెసిడెంట్‌గా షేక్ ఇంతియాజ్, సెక్రటరీగా శివ, ట్రెజరర్‌గా రత్నయ్యలు బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా విచ్చేసిన పాస్ట్ గవర్నర్ కె.చిన్నపరెడ్డి వీరందరి చేత ప్రమాణస్వీకారం చేయించారు. చంద్రశేఖర్‌రెడ్డి, రూపేష్ రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, దశరథ రామిరెడ్డి, లక్ష్మీ నారాయణ, అరుణకుమారి, లలిత, అప్పారావు, హేమలత, రాధాకృష్ణ, అంకుల్‌రావు, టి.సురేష్, సాయిసునీల్ కార్యవర్గసభ్యులకి అభినందనలు తెలియజేశారు.

## ఆర్టీసీ కార్మికులు..
# ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

ఆర్టీసీ కార్మికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీ పట్టణంలోని డిపో ప్రాంగణంలో కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నారాయణ, జయభారత్, గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఆయుర్వేద, హోమియో, ఈఎస్ఐ వైద్యులు అందరినీ ఒక చోటుకు చేర్చి 732 మందికి వైద్య సేవలు అందించామని తెలిపారు. డీఎం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# శివాలయంలో ప్రత్యేక పూజలు



గూడూరు శివాలయంలో సోమవారం నాడు ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శివాలయం ఛైర్మెన్ ఆరికట్ల బాలక్రిష్ణం నాయుడు, వేమకొమ్ము నరసింహం, నరేష్ స్వామి, పవన్ స్వామి, యశ్వంత్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ఎన్‌బికెఆర్‌లో.. పాలిటెక్నిక్ విద్యపై అవగాహన

పాలిటెక్నిక్ విద్య ఎంతో కీలకమైందని, విద్యార్థుల భవితకు ఎంతో ఉపయోగపడుతుందని ఎన్బీకేఆర్ ఐఎస్టీ ప్రిన్సిపాల్ డా. ఎం.శ్రీనివాసులు చెప్పారు. ఈనెల 16న కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో, కొత్తగా చేరిన పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తగు అవగాహన కోసం ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఈ మూడు సంవత్సరాల కాలాన్ని క్రమశిక్షణతో, పట్టుదలతో సద్వినియోగం చేసుకొని విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కళాశాల అడ్మిషన్ ఇన్చార్జి డా. సి. రవీంద్రరెడ్డి మాట్లాడుతూ, కళాశాలలో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సులు, వాటి ప్రత్యేకతలు, భవిష్యత్తులో వాటి ద్వారా లభించే ఉద్యోగ అవకాశాల గురించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సును ప్రారంభించేందుకు విశేష కృషి చేసిన కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్లేస్మెంట్ అధికారి డా.ఎస్.కిషోర్, యూవీహెచ్ కోఆర్డినేటర్ బి.రాఘవమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంకు..
# అంకబాబు ఆత్మీయ శుభాకాంక్షలు



రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని మంత్రి నివాసానికి వచ్చి, ఆయనకి ఆత్మీయంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రముఖ పాత్రికేయులు.. సీనియర్ జర్నలిస్టు కొల్లు అంకబాబు

## వికసిత భారత్ సాధనలో..
# విద్యార్థులదే కీలకపాత్ర

- డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్ డా.సతీష్‌రెడ్డి



విద్యార్థినికి మెడల్ అందజేస్తున్న డా. సతీష్‌రెడ్డి

నేటి విద్యార్థులే రేపటి వికసిత భారత్ సాధనలో విద్యార్థులదే కీలకపాత్ర అని ప్రముఖ శాస్త్రవేత్త, డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్ డా.సతీష్‌రెడ్డి చెప్పారు. ఇటీవల తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్(ఐసర్) ఏడవ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, 2047కు భారతదేశాన్ని వికసిత భారత్‌గా మరియు విశ్వ గురువుగా తీర్చిదిద్దడంలో విద్యార్థులు పముఖ పాత్ర పోషిస్తారని ఆయన ఆకాంక్షించారు. 2014లో 4000 ఉన్న ఇన్నోవేషన్ మరియు సార్టప్‌లు నేడు 2.40 లక్షలకు చేరాయని, వైద్య, విద్య, ఆరోగ్య, వ్యవసాయ మరియు పారిశ్రామిక రంగాలలో సాంకేతికతను విరివిగా వాడుకొని ఈ రంగాలలో భారతదేశాన్ని ప్రపంచంలో మొదటి స్థానానికి తీసుకొని రావడంలో నేడు దేశంలోని ఉన్నత విద్యాసంస్థలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దీనికి అనుగుణంగానే ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్‌లో విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించారన్నారు. అదేవిధంగా అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ప్రాజెక్ట్ అనే పథకం ద్వారా దేశీయంగా పరిశోధనలు ప్రోత్సహించేందుకు నిధులు కేటాయించడం జరిగిందని, ఉన్నత విద్యాసంస్థలలో పని చేస్తున్న అధ్యాపకులు ప్రైవేటు రంగంలో ఉన్న పరిశోధకులు ఈ నిధులను వినియోగించుకుని భారత దేశములో పరిశోధనా రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకువెళ్లాలని సూచించారు. భారతీయ ఉన్నత విద్యాసంస్థలు ప్రపంచ స్థాయిలో ప్రమాణాలను పాటించడం లేదనే మాటలో వాస్తవం లేదన్నారు. అనంతరం వివిధ సబ్జెక్టులలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సతాన్ భట్టాచార్య, ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# నేదురుమల్లి బాలకృష్ణారెడ్డికి.. రామ్ నివాళి



నేదురుమల్లి బాలకృష్ణారెడ్డికి నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

విద్యాదాత..పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల అధినేత..ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ కరెస్పాండెంట్, వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. జ్యోతి డే సందర్భంగా ఈనెల15న వాకాడులోని బాలకృష్ణారెడ్డి సేవాక్షేత్రం ప్రాంగణంలోని ఆయన సమాధికి రామ్‌కుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. నెల్లూరుజిల్లా వాకాడులో 1938 జులై15న పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాత్రి పాఠశాల ప్రారంభమైంది. ఆరోజును 'జ్యోతి డే'గా ఏటా జరుపుకోవడం తెలిసిందే. నేదురుమల్లి బాబురెడ్డి, భక్తవత్సలరెడ్డి, నేదురుమల్లి బంధుమిత్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ఎన్‌బీకేఆర్‌లో.. జ్యోతి డే

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి స్మృత్యంకంగా జ్యోతి డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. ఎం.శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు ఆ మహనీయునికి నివాళులర్పించారు. గతంలో, పూరిగుడిశెలోనే రాత్రి పాఠశాలను ప్రారంభమైన పాఠశాల, బాలకృష్ణారెడ్డి నిరుపమాన కృషితో అంచలంచెలుగా ఎదిగిందని, ఎందరో విద్యార్థులకు ఆయన విద్యాదానం చేశారని ఆయన అన్నారు. విద్య అనేది అజ్ఞానాన్ని, పేదరికాన్ని తొలగించే జ్ఞానజ్యోతి అని, బాలకృష్ణారెడ్డి సేవలను ఆయన ప్రస్తుతించారు. రామ్‌కుమార్‌రెడ్డి ఆ సేవలను అందిపుచ్చుకుని, ఎన్‌బీకేఆర్ ఐఎస్టీని ఒక డీమ్డ్ యూనివర్శిటీగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తుండడం సంతోషకరమన్నారు.

## 'అపోలో'లో..
# తక్కువ ఫీజులతో ప్లాస్టిక్ సర్జరీలు





వివరాలని వెల్లడిస్తున్న అపోలో వైద్యులు

నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో తక్కువ ఫీజులతో ప్లాస్టిక్ సర్జరీలు విజయవంతంగా చేయడం జరుగుతోందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. జులై15న ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు, డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ప్లాస్టిక్ సర్జరీ మరియు కాస్మోటిక్ సర్జరీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సర్జరీ అనగానే చాలామందికి ఇది అందాన్ని మెరుగుపరుచుకొనే ఆపరేషన్‌గానే అవగాహన ఉంటుంది. కానీ, నిజానికి ప్లాస్టిక్ సర్జరీలో ముఖ్యంగా రెండు ఉప విభాగాలు ఉంటాయని, అందులో ఒకటి రీ కన్ స్ట్రక్టివ్ సర్జరీ, రెండవది కాస్మోటిక్ సర్జరీ అని వివరించారు. సాధారణంగా ప్రజల్లో ప్లాస్టిక్ సర్జరీ అంటే ఖరీదు ఎక్కువగా ఉంటుందని అభిప్రాయం. కానీ అది నిజం కాదన్నారు. ఇతర సూపర్ స్పెషాలిటీ చికిత్సా విధానాలతో పోల్చి చూస్తే అంతే ధరకు ప్లాస్టిక్ సర్జరీ విధానాలు చేయవచ్చని తెలిపారు.

## కళాంజలి అనంత్ దర్శకత్వంలో..
# 'గమ్..మత్తు' షార్ట్‌ఫిలిమ్!







'గమ్.. మత్తు' షార్ట్‌ఫిల్మ్‌ని ప్రారంభిస్తున్న కళాంజలి అనంత్

ఇటీవల 'నాన్న', పండుటాకులు, చెట్టుతల్లి, 'అమ్మంటే'.. వంటి పలు సందేశాత్మక షార్ట్‌ఫిల్మ్‌లతో అవార్డులు పొందిన కళాంజలి అనంత్ దర్శకత్వంలో తాజాగా మరో షార్ట్‌ఫిల్మ్ రూపుదిద్దుకుంటోంది. గంజాయి..డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతను చైతన్యపరుస్తూ 'గమ్..మత్తు'- బివేర్ ఆఫ్ డ్రగ్స్..పేరుతో నిర్మిస్తున్న ఈ షార్ట్‌ఫిల్మ్‌ను ఈనెల 12న స్థానిక టౌన్‌హాల్ వద్దనున్న వినాయకుడి గుడి దగ్గర పూజలు చేసిన అనంతరం కళాంజలి గౌరవాధ్యక్షుడు వీరిశెట్టి హజరత్‌బాబు క్లాప్‌కొట్టి ప్రారంభించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు కెమెరా స్విచ్ఆన్ చేయగా, ఎం.ప్రసన్నాంజనేయులు తొలిషాట్‌ని ఆరంభించారు. లక్ష్మీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఈ లఘు చిత్రం ప్రారంభమైంది. డ్రగ్స్ యువతను బానిసలు చేసి, వారిని.. వారి కుటుంబాలను నాశనం చేస్తున్నదని, ప్రతిఒక్కరూ ఆ మహమ్మారికి దూరంగా ఉండాలనే కథాంశంతో ఈ షార్ట్‌ఫిల్మ్‌ను రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం కళాంజలి అనంత్ నిర్వహిస్తున్నారు. ప్రముఖ నటులు దోర్నాల హరిబాబు, బెనర్జీ, ప్రజానాట్యమండలి విజయకుమార్, కార్తీక్, ఉపేంద్ర, ఆరిఫ్, గవాస్కర్, బొమ్మలాట పార్వతీశం, సుబ్రహ్మణ్యం, నటీమణులు శిరీష, భాను, యశస్విని, తేజస్విని, నెల్లూరు భాగ్య, వర్షిత తదితరులు పాల్గొన్నారు. ఈ షార్ట్‌ఫిల్మ్‌కి రచనా సహకారం డా.కెకెఆర్ మూర్తి, మునిచంద్ర, గీత రచయిత మద్దూరి, సంగీతం సంగీత్ సౌరభ్, కెమెరా రాజేష్, మేకప్ సుధాకర్ సాంకేతిక సహకారం అందిస్తున్నారు.

## చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

చికెన్ వ్యర్థాలను చేపలగుంటలకు తరలిస్తున్న ఓ వాహనాన్ని ఇటీవల మర్రిపాడు పోలీసులు పట్టుకున్నారు. బ్రాహ్మణపల్లి టోల్‌గేట్ వద్ద ఎస్‌ఐ బలరామిరెడ్డి వాహనాలను తనిఖీ చేస్తున్న సందర్భంలో మైదుకూరు నుంచి 10 డ్రమ్ములలో చికెన్‌వ్యర్థాలు తీసుకువెళ్తున్న ఆ వాహనంలోంచి దుర్వాసన రావడంతో ఆ వాహనాన్ని తనిఖీ చేసి, కేసు నమోదు చేశారు. ఆ వ్యర్థాలను రెవెన్యూ సిబ్బంది సమక్షంలో గ్రామం వెలుపల గుంత తీసి పూడ్చివేశారు.

## సాహిత్యం సమాజానికి దర్పణం



సత్కారాన్నందుకుంటున్న హరి శంకరశర్మ

సాహిత్యం సమాజానికి దర్పణం వంటిదని, సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి సాహిత్యానికి ఉందని ప్రముఖ సాహితీవేత్త హరి శంకరశర్మ చెప్పారు. నెల్లూరు వర్ధమాన సమాజం హాల్‌లో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 15న జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని "సాహిత్యము-సమాజము' అనే అంశంపై ఉపన్యసించి, నిర్వాహకుల సన్మానం అందుకున్నారు. చేతన కార్యదర్శి శేషగిరీశం, వీ.ఆర్. కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షులు చలంచర్ల భాస్కర రెడ్డి ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ ఛైర్మన్ నలుబోలు బలరామయ్య నాయుడు, సాహితీవేత్తలు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, వేదం సూర్యప్రకాశం, కవయిత్రి గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

## నాయకత్వం.. ఓ బాధ్యత



బాధ్యతలు స్వీకరిస్తున్న విద్యార్థి నాయకులు

గూడూరు రూరల్, శారదానగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ పాఠశాలలో బుధవారం ఇన్వెస్టిచర్ సెరిమనీ ఘనంగా నిర్వహించారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావనను విద్యార్థుల్లో పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రూరల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ కె.తిరుపతయ్య ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, ప్రిఫెక్టులు తదితర బాధ్యతలను స్వీకరించిన విద్యార్థినాయకులకు బ్యాడ్జీలు, సాష్‌లు అందజేసి అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ, నాయకత్వం అంటే కేవలం పదవి కాదని బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాల దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సుధేష్ణ, ప్రిన్సిపాల్ నమశివాయ, హెడ్‌మాస్టర్ సురేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వ్యవసాయశాఖలో.. నలుగురికి ప్రమోషన్లు

జిల్లా వ్యవసాయశాఖలో విధులు నిర్వహిస్తున్న నలుగురికి ఇటీవల ఉద్యోగోన్నతులు (ప్రమోషన్లు) లభించాయి. గ్రామీణ వ్యవసాయశాఖ సహాయకులు(ఏఇఓ)గా ఉన్న ఆ నలుగురినీ వ్యవసాయ విస్తరణ అధికారులుగా నియమించారు. ఉద్యోగోన్నతి పొందినవారిలో డి.అనూష, కూరపాటి శ్రీహరి, గంగా అభిలాష్, అమ్మనబ్రోలు శివప్రియ ఉన్నారు.

# అత్యంత అమానవీయం... హృదయ విదారకం!

- కుక్కల మందుతో బావను చంపేశారు
- ఆ తర్వాత భార్యాబిడ్డలతో సహా రైలుకింద పడి చనిపోయారు



రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న నిందితుడు హరికృష్ణ కుటుంబం

***కలికాలం ఎంత మండిపోతోందో, డబ్బు పిశాచి మనుషులను ఎలా ఆటాడిస్తూ నాశనం చేస్తోందో.. బుచ్చి ఘటన ఒక తాజా ఉదాహరణ. బంధాలు, అనుబంధాలన్నీ డబ్బుకు దాసోహమైపోతున్నాయి. ఆస్తుల అంతస్తుల కోసం దురాశతో చివరికి తమ జీవితాలనే నాశనం చేసుకునే దుస్థితికి వచ్చేస్తున్నారు. తమతో పాటు తమ భార్యాబిడ్డల జీవితాలను కూడా అంతం చేస్తున్నారు. బుచ్చి వ్యవసాయ అధికారి హత్యోదంతం డబ్బుకు ఆశపడేవారికి ఒక పెద్ద గుణపాఠం అనుకోవచ్చు. జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆ దుర్ఘటనల వివరాలిలా ఉన్నాయి.***

నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన వ్యవసాయాధికారి ఎన్.శ్రీహరిని ఆయన బావమరిది కుడుముల హరికృష్ణ చంపేశాడనే వార్త ఇటీవల జిల్లాలో పెద్ద కలకలం కలిగించింది. ఈ హత్య జరగడంలోనే కాక, దాని తర్వాత ఆ కేసు మాఫీకి పోలీసులు ప్రయత్నించడం, పోలీసు ఉన్నతాధికారులు అది గమనించి ఆ పోలీస్‌స్టేషన్ సిబ్బందినంతా బదిలీ చేయడం అన్నీ సంచలనాలే. చివరికి బావను అత్యంత ఘోరంగా చంపేసిన ఆ బావమరిది పోలీసులకు దొరక్కుండా, ఏకంగా భార్యాపిల్లలతో కలిసి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకోవడం వరకూ.. ఇదో పెద్ద కథ కాదు..వ్యథే!..ఇంతటి దారుణమైన సంఘటన జిల్లాలో జరగడం ఇటీవలికాలంలో ఇదేనంటున్నారు. బావమరిది బావ బాగు కోరతాడని సామెత. కానీ, అందుకు భిన్నంగా బావ చావుకోరడం దారుణం..దయనీయం!..సొంత బావమరిదే..ఒక అధికారిగా ఉన్న తన బావ శ్రీహరికి..అత్యంత హేయంగా..కుక్కలను చంపే మందును ఇంజెక్షన్‌గా ఇచ్చి చంపేయడం ఎంత ఘోరమో చూడండి. పోలీసుల విచారణలో ఆ విషయాలన్నీ తేలడంతో జిల్లావ్యాప్తంగా అటు ప్రజల్లోనూ, ఇటు పోలీసులు, అధికార వర్గాల్లోనూ ఆందోళన కలిగించింది. మరీ ఇంత పైశాచికంగా బావను బావమరిదే చంపడం దేనికని పోలీసులు ఆరా తీస్తే, కేవలం ఆస్తి కోసమట. బావను చంపేశాక, గుండెపోటుతో చనిపోయాడని నమ్మించడానికి బావమరిది విశ్వప్రయత్నం చేశాడు కానీ, ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. చివరికి తన బతుకు కూడా కుక్కచావే అయ్యింది.

### కుక్కల మందుతో బావను చంపేశారు :

శ్రీహరి భార్య తన భర్త మృతి అనుమానాస్పదంగా ఉందని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లకి విన్నవించడంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. అసలు విషయాన్ని బట్టబయలు చేశారు. ఆస్తుల విషయంలో గొడవ రావడంతో, తన అక్క భర్త అయిన శ్రీహరిని..స్వయానా బావమరిది అయిన హరికృష్ణ చంపడానికి ప్లాన్ వేశాడని గుర్తించారు. గత నెల 15న మరో ఇద్దరితో కలిసి శ్రీహరిని కుక్కల మందుతో చంపించాడు. ఆ తర్వాత గుండెపోటుతో శ్రీహరి చనిపోయాడని వారి కుటుంబసభ్యులకు చెప్పారు. అంత్యక్రియలప్పుడు మృతుని ఒంటిపై గాయాలుండడం గమనించి శ్రీహరి బంధుమిత్రులు బుచ్చి పోలీసు సీఐ, ఎస్‌ఐల దృష్టికి తీసుకువచ్చినా.. ఎవరూ పట్టించుకోలేదు. అందుకు కారణాలు కూడా డబ్బే!..

### బుచ్చి పోలీసులంతా బదిలీ :

ప్రధాన నిందితుడైన హరికృష్ణపై ఆ కేసు మాఫీ చేయడానికి బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు, మరికొంతమంది కలిసి లక్షలాది రూపాయలు ముడుపులుగా తీసుకున్నారనే ఆరోపణలు రావడంతో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల వెంటనే విచారణకి ఆదేశించారు. ఆ పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారందరినీ అక్కడి నుంచి బదిలీ చేసేశారు. బుచ్చి అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐ, ఎస్‌ఐలతో సహా 23మందిని అక్కడి నుంచి ఎస్పీ బదిలీ చేయడం కూడా ఒక సంచలనమే అయింది. ఒక పోలీస్‌స్టేషన్‌లోని మొత్తం పోలీసు సిబ్బంది నిర్లక్ష్యపు తీరుతో ఇలా ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికావడం, అవినీతి ఆరోపణలతో ఒక పోలీస్‌స్టేషనంతా ఖాళీ కావడం కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తొలిసారి అని తెలుస్తోంది.అయితే, ఈ క(వ్య)థ.. ఇది అంతటితో ఆగిపోలేదు. ఈ వ్యవహారం కాస్తా పూర్తిస్థాయిలో బట్టబయలై నిందితుల మెడకు తగులుకొంది. శ్రీహరి హత్యకు సహకరించిన ఇద్దరు నిందితులు (గొలగమూడికి చెందిన రవీంద్ర, రామతీర్థంకి చెందిన యానాది)లను అప్పటికే పోలీసులు పట్టుకున్నారు. ప్రధాన నిందితుడైన హరికృష్ణ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో హరికృష్ణ పరారైపోయాడు.

### రైలుపట్టాలపై నలుగురూ బలన్మరణం :

ఈ హత్యకేసులో ప్రధాన నిందితుడైన హరికృష్ణ, ఈనెల 14వ తేదీ వేకువన పుట్టింట్లో ఉన్న తన భార్యాపిల్లలను కారులో తీసుకువెళ్ళాడు. భార్య ప్రణీత, అభంశుభం తెలియని పిల్లలు..అయిదేళ్ళ కుమార్తె, నాలుగేళ్ళ కుమారుడులతో కలిసి గూడ్స్ రైలుకు ఎదురెళ్ళి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు తనతోపాటు భార్య, బిడ్డలను కూడా బలిచేయడం అందరినీ కలచివేసింది. గత నెల 15 అమావాస్యనాడు శ్రీహరి హత్య జరిగితే, ఈనెల 14 అమావాస్య రోజున హరికృష్ణ కుటుంబమంతా రైలుపట్టాలపై శవాలుగా మారడం.. విధి వైపరీత్యమే! అత్యంత అమానవీయం.. హృదయ విదారకమైన ఈ ఘటన రాష్ట్రంలోనే సంచలనం కలిగించింది.

## టూకీగా...



### ఇనమడుగులో హోమియోపై అవగాహన

కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 14న హోమియో చికిత్సలపై వైద్య ఆరోగ్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు డాక్టర్ కరుణాకర్ అవగాహన కలిగించారు. డెంగ్యూ జ్వరాలకు సంబంధించి హోమియోపతి వైద్యంలో ఉన్న చికిత్సల వివరాలను ఆయన వివరించారు. వైద్యాధికారి డాక్టర్ నిరంజన్, డాక్టర్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

### దుండిగంలో..'పొలం పిలుస్తోంది'

దగదర్తి మండలం దుండిగం గ్రామంలో ఈనెల 13న మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ ఆధ్వర్యంలో రైతులకు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి, పంటపొలాలను పరిశీలించారు. వేరుశనగ పంటలపై రసం పీల్చే పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి జి.చరణ్, వీఏఏలు విష్ణు, అమీర్ పాల్గొన్నారు.

### దువ్వూరులో.. పవన్ ఆరోగ్యం కోసం పూజలు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటూ సంగం మండలంలోని దువ్వూరు గ్రామంలో ఈనెల 14న జనసేన పార్టీ నాయకులు భానుకిరణ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్థానిక దువ్వూరమ్మతల్లి దేవస్థానంలో కొబ్బరికాయలు, కర్పూరహారతులు సమర్పించి తమ నాయకుడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

### ఉదయగిరి.. నీళ్లట్యాంకులను పరిశుభ్రం చేయండి

ఉదయగిరి మండలంలోని 17 పంచాయతీల్లో ఉన్న ఓవర్ హెడ్ నీళ్ళ ట్యాంకులను పరిశుభ్రం చేసి క్లోరినేషన్ చేపట్టి చాలాకాలమైందని, అయినా పంచాయతీవారు నేటికీ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంచినీరు శుభ్రంగా లేకుంటే వ్యాధులు వస్తాయని భయపడుతున్నారు. అధికారులు పట్టించుకోవాలి మరి!..

### రామతీర్థంలో తెప్పోత్సవం

విడవలూరు మండలం రామతీర్థంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 14వతేదీ రాత్రి కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామికి వేడుకగా తెప్పోత్సవం నిర్వహించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని తరించారు.

### రాపూరులో ఉచిత నేత్రవైద్య శిబిరం

రాపూరులో ఈనెల 14న చాగణం లలితమ్మ-భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర అరవింద్ నేత్రాలయ వారి పర్యవేక్షణలో, ట్రస్ట్ ఐకె సీతారామనాయుడు ఆధ్వర్యంలో డాక్టర్ సింధు పాల్గొని 113 మంది కంటిరోగులను పరీక్షించి, అవసరమైనవారికి కళ్ళద్దాలను అందజేశారు.

### కొరిమెర్లలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

సంగం మండలం కొరిమెర్ల గ్రామంలో పేకాటస్థావరాలను గుర్తించి పోలీసులు ఈనెల 14న దాడులు చేశారు. ఎస్ భోజ్యానాయక్ ఆధ్వర్యంలో దాడులు చేసి, పేకాటాడుతున్న ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేశారు. వారి నుంచి 5,080 రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

### గుడినరవలో పశుగ్రాస వారోత్సవాలు

ఉదయగిరి మండలం గుడినరవ గ్రామంలో ఈనెల 14న పశువైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలు జరిగాయి. పాడిరైతులకు పశుగ్రాసం సాగు విషయంపై ఆయన అవగాహన కలిగించారు. పశుగ్రాసం సాగు చేసుకుంటే ఏడాది పొడవునా పశువులకు నాణ్యమైన మేత అందించవచ్చని రైతులకు సూచించారు.

### కాకువారిపాలెం చిన్నారులకు పలకలు

చిల్లకూరు మండలంలోని కాకువారిపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ చిన్నారులకు ఈనెల 14న ఎంవీ రావు ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పలకలు, విద్యాసామగ్రిని పంపిణీచేశారు. సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ట్రస్ట్ ఛైర్మన్ లీలా మోహన్ కృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ పాల్గొన్నారు.

# ఓటీటీ స్వేచ్ఛకు హద్దులు ఉండాలి

**ఒకప్పుడు సినిమా థియేటర్‌కు వెళ్లి చూడాల్సిన చిత్రాలు, నిర్ణీత సమయాల్లో మాత్రమే ప్రసారమయ్యే టెలివిజన్ కార్యక్రమాలు, ఇప్పుడు మొబైల్ ఫోన్‌తో పాటు స్మార్ట్ టీవీల ద్వారా ఇంటింటికీ చేరాయి. ఓటీటీ (OTT) వేదికలు వినోద రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. భాషా, ప్రాంతీయ సరిహద్దులను చెరిపేస్తూ ప్రపంచ స్థాయి కథలని, కథనాలని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాయి. కొత్త రచయితలకు, దర్శకులకు, నటీనటులకు అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇదంతా స్వాగతించదగ్గ పరిణామమే.**

## అశ్లీలత, అసభ్యత, అతి హింస వంటివాటిని అదుపు చేయాలి



అయితే, ఈ స్వేచ్ఛ కొందరి చేతుల్లో స్వైరవిహారంగా మారడం ఆందోళన కలిగించే విషయం. ఇటీవల అనేక భాషల్లో, ముఖ్యంగా తెలుగులో విడుదలవుతున్న కొన్ని వెబ్‌సిరీస్‌లు, సినిమాలు, కార్యక్రమాలను పరిశీలిస్తే కథ కంటే అశ్లీలత, పాత్రల కంటే బూతులు, భావోద్వేగాల కంటే హింస, కళాత్మకత కంటే సంచలనమే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రేక్షకులను ఆకర్షించడానికి అసభ్యతనే ప్రధాన ఆయుధంగా మార్చుకోవడం ప్రమాదకర ధోరణి.

నేడు ఓటీటీ వేదికలు వ్యక్తిగత మొబైల్ ఫోన్‌లకే పరిమితం కావడం లేదు. కుటుంబసభ్యులంతా కలిసి స్మార్ట్ టీవీల్లో వీక్షించే ప్రధాన వినోద సాధనంగా మారాయి. తల్లిదండ్రులు, పిల్లలు, పెద్దలు కలిసి చూస్తున్న సమయంలో అకస్మాత్తుగా అసభ్య దృశ్యాలు, అసహ్యకరమైన భాష, అభ్యంతరకరమైన సంభాషణలు, అతిగా చిత్రీకరించిన హింసా సన్నివేశాలు ప్రత్యక్షమవుతున్నాయి. ఇది కేవలం అసౌకర్యమే కాదు, కుటుంబ విలువలకు, చిన్నారుల మానసిక వికాసానికి కూడా ఇది సవాలుగా మారుతోంది.

సృజనాత్మక స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో అత్యంత పవిత్రమైన హక్కు. కానీ ఏ హక్కుకైనా బాధ్యత అన్నది కూడా అందులో అంతర్భాగమే. భావ ప్రకటనా స్వేచ్ఛ అంటే సామాజిక బాధ్యతను విస్మరించే అనుమతి కాదు. కళ పేరుతో అసభ్యతను, వాస్తవికత పేరుతో బూతులను, ప్రయోగం పేరుతో వికృతిని సమర్థించడం సమాజానికి మేలు చేయదు. ఒక మంచి కథను చెప్పడానికి అసభ్యత తప్పనిసరి అనే వాదన కళను అవమానించడమే.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు డిజిటల్ కంటెంట్‌పై వయోపరిమితి, కంటెంట్ వర్గీకరణ, ప్రసార ప్రమాణాల వంటి వ్యవస్థలను అమలు చేస్తున్నాయి. మన దేశంలో మాత్రం ఓటీటీ రంగం ప్రధానంగా స్వీయ నియంత్రణ పద్ధతిపైనే ఆధారపడుతోంది. కానీ ఆ వ్యవస్థ ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదన్న అభిప్రాయం రోజురోజుకూ బలపడుతోంది. వయోపరిమితి సూచనలు, చిన్న హెచ్చరికలు చూపించడం మాత్రమే సరిపోదు. పిల్లల చేతిలో మొబైల్ ఉన్న ఈ కాలంలో అవి ప్రభావవంతమైన రక్షణ కాదనే వాస్తవాన్ని కూడా అంగీకరించాల్సిందే.

ఇక్కడ ఒక ప్రాథమిక ప్రశ్నకు ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి. థియేటర్లలో విడుదలయ్యే సినిమాలకు సెన్సార్ తప్పనిసరి అయితే, అదే సినిమా ఓటీటీలో విడుదలైతే ఎందుకు అలాంటి ప్రమాణాలు అవసరం ఉండకూడదు? కోట్లాది మంది ఒకేసారి ఇంట్లోనే వీక్షించే కంటెంట్‌కు కనీస నైతిక ప్రమాణాలు ఉండకూడదా? సమాజంపై ప్రభావం చూపే మాధ్యమాలకు బాధ్యత కూడా అంతే స్థాయిలో ఉండాలి కదా?

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని అత్యంత బాధ్యతాయుతంగా పరిశీలించాల్సిన సమయం ఆసన్నమైంది. దీని అర్థం కళాకారుల గొంతు నొక్కేయడం కాదు. విమర్శించే హక్కును, ప్రశ్నించే హక్కును, ప్రయోగాలు చేసే అవకాశాన్ని హరించడం అన్నది ప్రధాన లక్ష్యం కానే కాదు. కానీ సమాజాన్ని కలుషితం చేసే అశ్లీలత, అసభ్య పదజాలం, కారణం లేని నగ్నత్వం, హింసను వ్యాపార వస్తువులుగా మార్చే ధోరణిపై మాత్రం స్పష్టమైన నియంత్రణ అవసరం.

కేంద్ర ప్రభుత్వం ఓటీటీ కంటెంట్‌కు సంబంధించి మరింత పారదర్శకమైన, కఠినమైన మార్గదర్శకాలను రూపొందించాలి. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను బలోపేతం చేయాలి. చిన్నారులకు హానికరమైన కంటెంట్‌పై ప్రత్యేక నిఘా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంలో చురుకుగా వ్యవహరించాలి. అవసరమైతే నిపుణులు, న్యాయవేత్తలు, సినీ ప్రముఖులు, విద్యావేత్తలు, బాలల హక్కుల సంఘాలు, తల్లిదండ్రుల ప్రతినిధులతో కూడిన స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడం అనే విషయం కూడా పరిగణలోకి తీసుకోవాలి.

అదే సమయంలో ఓటీటీ సంస్థలు కూడా ఆత్మ పరిశీలన చేసుకోవాలి. తాత్కాలికంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడానికి సంచలనాన్ని అమ్ముకోవచ్చు. కానీ దీర్ఘకాలంలో నిలిచేది మంచి కథ, గొప్ప నటన, విలువలతో కూడిన సృజన మాత్రమే. అసభ్యతతో వచ్చే ఆదాయం తాత్కాలికం, నాణ్యమైన సృజనతో వచ్చే గౌరవం శాశ్వతం.

వినోదం పేరుతో సమాజాన్ని విలువల రహితంగా మార్చే ప్రయత్నాలను ప్రజలు కూడా ప్రశ్నించాలి. మంచి కంటెంట్‌ను ఆదరిస్తూ, అభ్యంతరకరమైన కంటెంట్‌పై తమ అభిప్రాయాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేయాలి. ఎందుకంటే చివరికి మార్కెట్‌ను నిర్ణయించేది ప్రేక్షకుడే.

స్వేచ్ఛ అవసరం. కానీ స్వేచ్ఛకు సంస్కారం కూడా తోడై ఉండాలి. సృజనాత్మకత అవసరం. కానీ సృజనాత్మకత పేరుతో సామాజిక బాధ్యతను తాకట్టు పెట్టకూడదు. ఓటీటీ వేదికలు వినోదాన్ని అందించాలి గానీ, విలువలను విచ్ఛిన్నం చేసే సాధనాలుగా మారకూడదు. ప్రజల మనోభావాలు, కుటుంబ వ్యవస్థ, భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమతుల్యమైన, పారదర్శకమైన, కఠినమైన నియంత్రణ వ్యవస్థను తక్షణమే తీసుకురావడం చాలా అవసరం. ఇది వారి కనీస భాద్యత. కళాస్వేచ్ఛను కాపాడుతూనే సామాజిక బాధ్యతను నిలబెట్టే మార్గమే ప్రజాస్వామ్యానికి, సమాజానికి కూడా శ్రేయస్కరం.

- శివ

## కాపు నాయకుడు ముద్రగడ..ఇక లేరు!



కాపు ఉద్యమ నేత..మాజీమంత్రి, వైకాపా నాయకుడు ముద్రగడ పద్మనాభం (73) కన్నుమూశారు. మూత్రపిండాల సమస్యతో చికిత్స పొందుతూ ఈనెల 14న ఆయన హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి ఆయన స్వస్థలం. వీరిది రాజకీయ కుటుంబం. ప్రత్తిపాడు నుంచి 1978లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో ఎక్సైజ్, రవాణాశాఖల మంత్రిగా కూడా ఉన్నారు. కాకినాడ నుంచి లోక్‌సభకి పోటీచేసి విజయం సాధించారు. కాపు ఉద్యమ నేతగా ప్రఖ్యాతిచెందిన ఆయన, కాపులను బీసీల్లో చేర్చాలంటూ పెద్దఎత్తున ఉద్యమించారు. గత ఎన్నికల ముందు వైకాపాలో చేరారు. ఆయన మరణంతో కాపు వర్గాలు ఒక ఉద్యమ నేతను కోల్పోయినట్లయింది.

## స్వరము వీడి.. పరము చేరె!



తేట తేట గొంతులో
పాట చిక్కుకుందిరో...
అయిదు పుష్కరాల పాటు
తేనె తానమందిరో...
మల్లె జాజి మంత్రమేసి
నింగి నేల పసుపు రాసి
నవరసాల కోక కట్టి
పదము పదము పరవశంగా
మదిని ఏలుకుందిరో..
చిన్న- కన్నె.. వయసుల
సరిగమలు పాడుకుందిరో...
నలుపు తెలుపు రోజు నుండి
రంగు తెరల హంగు వరకు
క్రిందన కావేరి నుండి
పైన ఉన్న గంగ వరకు
ఎన్ని ఎన్ని భాషలో
ఎంత మధుర బాసలో...

పల్లకంటి పల్లవొదిలి
చిరునవ్వుల చరణమొదిలి
ఇంక చాలునంటు అంటే
కాలమేమో కదిలిపోయి
ఆ జ్ఞాపకంలో మిగిలిపోయి
నీవు లేని నేల మీద
రాగమింక ఏల అంటు...
పాట గొల్లుమందిరో...
వదిలి వెళ్ళకందిరో...
కాలమహిమ మరవకంటు
జానకమ్మ నవ్వగానే..
కనుల నీరు తుడుచుకుంటు
తన పాటలన్ని తలచుకుంటు
నిండు బ్రతుకు నీది అంటు
సరే వెళ్ళమందిరో...
సుస్వరాల స్వరము వీడి
పరము చేరమందిరో...!



కె.త్రినాథరావు
9440886844

## జానకమ్మ అస్తమయం

***సినీ సంగీతరంగంలో ఆరు దశాబ్దాలుగా అలుపెరుగని ప్రస్థానం చేస్తూ, దాదాపు 50 వేలకు పైగానే పాటలు పాడి శ్రోతలను ఉర్రూతలూగించిన ప్రఖ్యాత గాయని..పాటల కోయిలమ్మ..జానకమ్మ ఇక లేరు. 20 భారతీయ భాషలతో పాటు జపాన్, జర్మనీ దేశాల భాషల్లో కూడా అద్భుతంగా పాటలు పాడి అందరి ప్రశంసలందుకున్న అంతర్జాతీయ గాయని, భరతమాత రాగాల గారాల ముద్దుబిడ్డ ఎస్. జానకి స్వరం మూగబోయింది. 88 ఏళ్ల వృద్ధాప్యంలో కూడా ఆమె పసిపిల్లలా గొంతెత్తి పాటలు పాడేవారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ ఈనెల 11వ తేదీన మైసూరులో ఆమె తుదిశ్వాస విడిచారు. జానకమ్మ అస్తమయంతో సినీ రంగంలోనూ.. సంగీతప్రపంచంలోనే పెనుచీకటి ఆవరించినట్లయింది. ప్రత్యేకించి ఆమె నెల్లూరు కోడలు కావడంతో, నెల్లూరు సీమ ప్రజలు ఆ మహాగాయని మృతికి మరింతగా ఆవేదన చెందారు.***

జానకమ్మ స్వస్థలం..గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామం. 1938 ఏప్రిల్ 23న ఆమె జన్మించారు. తండ్రి శ్రీరామమూర్తి ఉపాధ్యాయులు. చిన్నతనం నుంచి ఆమెకు సంగీతమంటే ఇష్టం. మూడేళ్ళ వయసునుంచే పాటలు పాడడం ఆరంభించారామె. కాస్త పెద్దయ్యాక లతా మంగేష్కర్ పాటలంటే అభిమానంతో ఆమె పాడిన పాటలు పాడుతుండేవారు. ఆ తర్వాత మన మధురగానంతో అనేక ప్రాంతాల్లో పాటకచ్చేరీలు చేసేవారు. రాజమండ్రిలోని క్రాంతి కళామండలి తరపున పాటలు పాడుతుండేవారు. ఈ నేపథ్యంలో 1959లో ఆమెకు నెల్లూరుకు చెందిన రామ్‌ప్రసాద్‌తో వివాహమైంది. ప్రఖ్యాత 'ఫన్ డాక్టర్' చంద్రశేఖర్ ఆమె మామగారు. భర్త, మామల ప్రోత్సాహంతో ఆమె పాటలు పాడడంలో మరింత సుప్రసిద్ధులయ్యారు. ఆ తర్వాత మద్రాసులోని ఏవీఎం సంస్థలో గాయనిగా ఆమెకి అవకాశం వచ్చింది. 1957లో 'ఎమ్మెల్యే' చిత్రంలో ఘంటసాలతో కలసి 'నీ ఆశా అడియాస..చేజారే మణిపూస' అంటూ ఆరుద్ర రాసిన గీతాన్ని అద్భుతంగా పాడారు. ఇకనుంచీ ఆమె వెనుదిరిగి చూడలేదు. ఎన్నో తెలుగు, తమిళ చిత్రాల్లో ఆమె పాటలు మారుమ్రోగాయి. ఉత్తమ గాయనిగా ఏడుసార్లు, జాతీయస్థాయిలోనూ నాలుగు సార్లు పురస్కారాలందుకున్నారు. తమిళ నాడు ప్రభుత్వం నుంచి విశిష్టమైన 'కలైమామణి' పురస్కారాన్ని కూడా అందుకున్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com